ముప్పాళ్లపాడు సొసైటీలో
భారీ అక్రమాలు



లక్షలాది రూపాయలు దుర్వినియోగం

రూ.1.60 కోట్ల రుణాల బాండ్లు మాయం

1,290 మందివి వాయిదా మీరిన బకాయిలు

ఆడిట్‌లో వెల్లడైన అవకతవకలు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 6 : పీడీసీసీ బ్యాంకు కనిగిరి శాఖ పరిధిలోని హనుమంతునిపాడు మండలం ముప్పాళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఆడిట్‌లో అనేక అక్రమాలు వెలుగు చూశాయి. ఇప్పటికే రూ.1.20 కోట్ల నష్టాల్లో ఉన్న సొసైటీ తాజాగా వెలుగుచూసిన అక్రమాలతో మరింత ఇబ్బందుల్లోకి వెళ్లింది. వివిధ రూపాల్లో సొసైటీ నిధులు స్వాహా చేశారు. 258 మంది రైతులకు ఇప్పించిన రుణాలు రూ.1.60 కోట్లకు సంబంధించిన బాండ్లు కనిగిరి బ్యాంకు శాఖలో గల్లంతయ్యాయి. ఈ మొత్తం వసూలు ప్రశ్నార్థకంగా మారింది. 1,290 మంది రైతుల రుణ బకాయిలు వాయిదా మీరిపోవడంతో వాటికి సంబంధించి సుమారు రూ.4కోట్లు సొసైటీ వదులుకోవాల్సి వస్తోంది. రుణాలకు సంబంధించి రైతులు చెల్లించాల్సిన వడ్డీ మొత్తాలను తక్కువగా వసూలు చేసినట్లు చూపించి మిగతా స్వాహా చేశారు. సొసైటీలో జరిగిన ఈ అక్రమాలపై ఆడిటర్ కె.వెంకటేశ్వర్లు ప్రత్యేక నివేదికను సమర్పించారు. ఈ మొత్తాలను పాలకవర్గం, సీఈవో నుంచి 18శాతం వడ్డీతో వసూలు చేయమని, అక్రమాలను తేల్చేందుకు సమగ్ర విచారణ జరిపించాలని ఒంగోలు డివిజనల్ సహకారాధికారి పి.రాజశేఖర్ డీసీవో బి.శ్రీనివాసరెడ్డిని కోరారు. తగు చర్యల కోసం ఈ ప్రత్యేక నివేదికను పీడీసీసీ బ్యాంకు సీఈవోకు పంపినట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా డీసీఏవో చెప్పారు.

సొసైటీ నుంచి పీడీసీసీ బ్యాంకు కనిగిరి శాఖ ద్వారా రూ.1.60 కోట్ల రుణాలు పొందిన 258 మంది రైతులకు సంబంధించిన తనఖా బాండ్లు కనిగిరి బ్యాంకులో గల్లంతయ్యాయి. రుణాలకు సంబంధించిన బకాయిలు వసూలయ్యేంత వరకు ఈ బాండ్లను బ్యాంకులో జాగ్రత్తగా భద్రపర్చాలి. అయితే బ్యాంకులో ఒకటి రెండు కాకుండా మొత్తం బాండ్లు గల్లంతు కావడం సంచలనంగా మారింది. రుణాలకు సంబంధించి తనఖా బాండ్లు

తనఖా బాండ్లు మాయం

మాయం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొసైటీ పాలకవర్గం అప్పటి బ్యాంకు అధికారులు కుమ్మక్కై బాండ్లను మాయం చేశారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అసలు బాండ్లు లేకుండానే రుణాలు పంపిణీ చేశారా? అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. బ్యాంకు, సహకారశాఖ అధికారుల నిర్లక్ష్యం సొసైటీని కోలుకోలేని దెబ్బతీసింది. అధికారుల వైఖరిని అక్రమార్కులు ఆసరా చేసుకొని సొసైటీని పీల్చిపిప్పి చేశారు.

అక్రమాలు ఇవీ...

- సొసైటీలో జరిగిన పలు అక్రమాలకు సొసైటీ పాలకవర్గం, సీఈవోలను బాధ్యులను చేశారు.
- నిబంధనలకు విరుద్ధంగా సొసైటీలో రోజువారి కూలి కింద ఒకరిని నియమించి అతనికి రూ.36వేలు చెల్లించారు. ఈ మొత్తాన్ని పాలకవర్గం నుంచి వసూలు చేయాలని సిఫార్సు చేశారు.
- స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు వసూలులో 14 మంది రైతుల నుంచి రూ.3,89,152 రావాల్సి ఉండగా రూ.1,59,087 మాత్రమే వసూలు చేసినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. మిగిలిన రూ.2,08,855 రైతుల నుంచి అసలు నిజంగా వసూలు చేయలేదా? లేక వసూలు చేసి దిగమింగారా అన్నది తేలాల్సి ఉంది.
- ఇద్దరు రైతులకు సంబంధించి హెచ్ఎండీ డిపాజిట్లు లేనప్పటికీ ఉన్నట్లుగా రికార్డుల్లో చూపించి ఆ మొత్తం లోనుకు జమ చేసినట్లు లెక్కలు రాసి స్వాహా చేశారు.
- సొసైటీలో రెండు గదులు మరమ్మతుల కోసం రూ.1,83,620 వ్యయం చేసినట్లు చూపించారు. దీనికి సంబంధించిన అంచనాలు, ఎంబుక్ లేనందున ఆ మొత్తాన్ని పాలకవర్గం, సీఈవో నుంచి వసూలు చేయనున్నారు.
- 51 మంది రైతులకు సంబంధించి సుమారు రూ.కోటికిపైగా రుణం నుంచి వడ్డీ లేకుండా కేవలం అసలు మాత్రమే వసూలు చేసినట్లు నమోదు చేశారు. ఈ రుణాలకు సంబంధించి నిజంగా రైతుల నుంచి వడ్డీ వసూలు చేయలేదా లేక వసూలు చేసి స్వాహా చేశారా అన్నది విచారణలో తేలాల్సి ఉంది.



వినాయకుడిని కొనుగోలు చేసి తీసుకెళుతున్న యువకులు



పత్రిని తీసుకెళుతున్న మహిళలు

గణనాయకాయ
గణాధ్యక్షాయ

వినాయక నవరాత్రులకు ఏర్పాట్లు పూర్తి

నేడు వినాయక చవితి పండుగ

పూలకు, పండ్లకు, పురోహితులకు పెరిగిన డిమాండ్



గణనాథులు




ఒంగోలు గాంధీరోడ్డులో...

వినాయక నవరాత్రి ఉత్సవాలకు జిల్లాలో నగరాలు, గ్రామాలు ముస్తాబయ్యాయి. పలు ప్రాంతాల్లో యువకులు ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకలను నిర్వహించేందుకు ఇప్పటికే పందిళ్లు ఏర్పాటు చేసి అందులో భారీ వినాయక విగ్రహాలను ఉంచారు. ఏటా భాద్రపద శుక్ల చవితిని వినాయక చవితి పండుగ్గా జరుపుకోవటం, ఆ రోజు నుంచి నవరాత్రులు నిర్వహించుకోవటం ఆనవాయితీ. ఈ సంవత్సరం ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమవుతున్నాయి.

జిల్లావ్యాప్తంగా గ్రామాల మొదలు పట్టణాల వరకు యువకులు కమిటీలుగా ఏర్పడి వినాయక నవరాత్రులు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అదేవిధంగా ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో పందిళ్లు వేసి, వాటిని విద్యుత్ దీపాలతో అలంకరించి, భారీ విగ్రహాలను పూజకు సిద్ధం చేశారు. పూలకు, పండ్లకు, పురోహితులకు డిమాండ్ పెరిగింది.



ఒంగోలులో పత్రిని కొనేందుకు వచ్చిన ప్రజలు



కొలువుదీరిన భారీ గణనాథుడు

బాధితులకు అండగా...

- కొనసాగుతున్న నిత్యావసరాలు, మంచినీరు తరలింపు
- తాజాగా కలెక్టర్ నేతృత్వంలో లక్ష పొట్లాల ఆహారం సరఫరా
- ముందుకు వస్తున్న విభిన్నవర్గాలు, భారీగా విరాళాల సేకరణ
- సహాయక కార్యక్రమాల పర్యవేక్షణలో మంత్రి డాక్టర్ స్వామి

వరద బారిన పడిన విజయవాడ ప్రజానీకానికి జిల్లావాసుల సహాయం కొనసాగుతోంది. ముంపు నుంచి అక్కడి ప్రజలు కొంతమేర తేరుకున్నప్పటికీ ఆహారం, తాగునీరు, ఇతర నిత్యావసరాల అవసరం అధికంగా ఉంది. దీంతో జిల్లాలోని వివిధ వర్గాల వారు శుక్రవారం కూడా భారీగా ఫుడ్ ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్లు, దుప్పట్లు ఇతరత్రా పలు రకాల సామగ్రి పంపించారు. అలాగే విభిన్న వర్గాల వారు పెద్దఎత్తున విరాళాలు కూడా అందజేస్తున్నారు.

ఒంగోలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లాలో పెద్ద ఎత్తున జనం ముందుకొస్తున్నారు. నాలుగు రోజులుగా లక్షలాది ఫుడ్ పార్శిళ్లు, తాగునీటి బాటిళ్లను అధికార యంత్రాంగం పంపుతుండగా, వివిధ వర్గాల ప్రజలు సైతం స్పందించి సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. అదే స్ఫూర్తితో కొనసాగిస్తూ శుక్రవారం కూడా కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో లక్ష ఆహార పొట్లాలు, వేలాది పాల ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్లు, దుప్పట్లు, అగ్గిపెట్టెలు వంటి వాటిని పంపించారు. అలాగే సీఎం సహాయ నిధికి భారీగా విరాళాలు అందజేస్తున్నారు.

ఆహారం, సరుకులు, దుస్తులు కూడా



విజయవాడకు పాలప్యాకెట్లను తీసుకెళ్తున్న ఉద్యోగులు

ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది సమకూర్చిన సాయాన్ని కలెక్టర్ సూచనలతో విడివిడిగా వాటిని లారీలు, ట్రాక్టర్లలో తీసుకెళ్లారు. ఐదారు రోజులుగా జిల్లా నుంచి వెళ్లి విజయవాడలో సహాయక కార్యక్రమాల్లో ఉన్న అధికారుల బృందం పర్యవేక్షణలో అక్కడి ప్రజలకు వాటిని అందజేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన విభిన్న వర్గాల వారు కూడా ఆహారం సరఫరా చేస్తున్నారు.

ఒంగోలు నగరానికి చెందిన శ్రీకృష్ణా ట్రావెల్స్ యజమాని చెన్నుపాటి వేణుగోపాల్, వారి సోదరుల నేతృత్వంలో ఆహారం, మంచి నీటి బాటిళ్లు, దుస్తులు లారీలో పంపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జెండా ఊపి ఆ వాహనాన్ని పంపారు. ఎన్‌జీపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన రజక యువజన సంఘం ప్రతినిధులు రెండున్నర వేల పులిహోర పొట్లాలను, 1,200 మంచినీటి బాటిళ్లను పంపారు. మార్కాపురంలోని అల్ఫా గ్లోబల్ మినీ స్పేస్ వారు విజయవాడ కబేలా సెంటర్‌లోని 500 కుటుంబాలకు ఆహారం, మంచినీరు అందించారు.

భారీగా ఆర్థిక సాయం

మరోవైపు వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు జిల్లా నుంచి భారీగానే విరాళాలు అందజేస్తున్నారు. వివిధ వర్గాల వారు ఎవరికి వారు స్వయంగా పంపుతుండగా కొన్ని ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులు, ఇతర వర్గాల వారు, విద్యార్థులు విరాళాలు వసూలు చేస్తున్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ విజ్ఞప్తి మేరకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల టీడీపీ నాయకులు భారీగా సీఎం సహాయనిధికి విరాళాలు పంపిస్తున్నారు. ఇదిలా ఉండగా విజయవాడ నగరంలో సహాయక కార్యక్రమాల పర్యవేక్షణలో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి శుక్రవారం కూడా పాల్గొన్నారు. అక్కడి జక్కంపూడి కాలనీలో పర్యటించి వరద బాధితులకు ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపులను సందర్శించారు. ఆ సమయంలో ఫిట్స్ వచ్చి పడిపోయిన మహిళకు దగ్గర ఉండి వైద్యం చేయించారు. అలాగే పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో బాధితులకు అందించేందుకు ఉంచిన నిత్యావసర సరుకులను పరిశీలించారు. వినాయక చవితి పర్వదినం రోజున కూడా సహాయక కార్యక్రమాలు కొనసాగనున్నట్లు సమాచారం.



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి స్వామి

10వేల ఆహార ప్యాకెట్లు

విజయవాడలో భారీ వరదలతో ప్రజానీకం తల్లడిల్లిపోతుండటంతో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ఒంగోలు నుంచి శుక్రవారం పదివేల పులిహోర ప్యాకెట్లను ప్రత్యేక బస్సుల్లో తరలించారు. కలెక్టరేట్ ఎదుట జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి జెండా ఊపి ఆ బస్సులను ప్రారంభించారు. ఆ ఆహార ప్యాకెట్లను అక్కడి అధికారుల సూచనలకు అనుగుణంగా కాలనీల్లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో ఎన్.శివప్రసాద్, కార్యాలయ సిబ్బంది జి.రామకృష్ణ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు. వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ వడియరాజుల సేవాసంఘం తరఫున రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు విజయవాడకు మూడు వేల వాటర్ బాటిళ్లను ప్రత్యేక వాహనంలో పంపించారు.

విజయవాడలో పారిశుధ్య పనులు ముమ్మరం

అందుకోసం 16 బృందాల ఏర్పాటు

ఒక్కొక్క బృందానికి పంచాయతీ కార్యదర్శి నాయకత్వం

జిల్లా నుంచి బాధితులకు పదివేల ఆహార ప్యాకెట్లు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 6: విజయవాడలో పారిశుధ్య పనుల నిర్వహణలో జిల్లాకు చెందిన పంచాయతీ కార్మికులు భాగస్వాములయ్యారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 50 మంది పారిశుధ్య కార్మికులు, 15 మంది పంచాయతీ కార్యదర్శులు విజయవాడకు తరలివెళ్లారు. విజయవాడ నగరంలోని పలు కాలనీల్లో పారిశుధ్య పనులతోపాటు బ్లీచింగ్ వంటి పనులు చేసేందుకు పంచాయతీ పారిశుధ్య కార్మికులను 15 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క బృందంలో ముగ్గురు పారిశుధ్య కార్మికులకు కలిపి పంచాయతీ కార్యదర్శిని నియమించారు. వారి ద్వారా ఆ కాలనీల్లో శుభ్రం చేయడంతోపాటు బ్లీచింగ్ వంటి పనులు చేపడుతున్నారు. విజయవాడలోని రామవరప్పాడు, ఎనికెపాడు, గొల్లపూడి ప్రాంతాలు, పెనుగంచిప్రోలు మండలంలోని గుమ్మడిదుర్రు, అనిగండ్లపాడు, ముచ్చింతల, శనగపాడు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇంకోవైపు పంచాయతీలకు చెందిన ఎలక్ట్రీషియన్లు కూడా ఈ పనుల్లో పాల్గొన్నారు. జిల్లాకు చెందిన పారిశుధ్య కార్మికులు తమవంతు బాధ్యతగా అక్కడ విధులు నిర్వహిస్తున్నారు.



పారిశుధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

రేషన్ బియ్యంపై
నిరంతరం నిఘా

కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు 31 కేసుల నమోదు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 6 : జిల్లాలో రేషన్ బియ్యంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిరంతరం నిఘా ఉంచినట్లు డీఎస్‌వో ఉదయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. 'రెచ్చిపోతున్న రేషన్ మాఫియా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 31కి పైగా 6(ఏ) కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జిల్లావ్యాప్తంగా రేషన్ పంపిణీని పర్యవేక్షిస్తూ బియ్యం పక్కదారి పట్టకుండా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు

ఆలస్యంగా వచ్చిన ఎంఈవోలపై ఆగ్రహం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 6 : జిల్లా విద్యాశాఖ సమీక్షా సమావేశానికి ఆలస్యంగా వచ్చిన 28మంది మండల విద్యాధికారులపై సమగ్రశిక్ష ఏఎస్పీడీ, జిల్లా నోడల్ అధికారి కే శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభమైంది. ఐదు నిమిషాలు ఆలస్యంగా 28 మంది ఎంఈవోలు వచ్చారు. వారిని హాలులోకి అనుమతించకుండా వారిపై ఏఎస్పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటల తరబడి బయటే ఉంచారు. అనంతరం ఆయన ఎంఈవోలను ఉద్దేశించి మాట్లాడుతూ యూడైస్ పక్కాగా నిర్వహించాలన్నారు. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా సర్దుబాటు చేయాలని ఆదేశించారు. డీఈవో సుభద్ర, ఉపవిద్యాధికారులు సోమా సుబ్బారావు, చంద్రమౌళీశ్వరరావు, ఏసీ కే శివకుమార్ పాల్గొన్నారు.

కూలిన హైవాల్‌ను పరిశీలించిన ఎస్పీ



క్వారీని పరిశీలిస్తున్న ఎస్పీ

లోపలి పేజీల్లో..


ఒంగోలు నుంచి చెన్నుపాటి బ్రదర్స్ అందించిన సామగ్రితో వెళుతున్న వాహనానికి జెండా ఊపుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్


సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న నరేంద్రబాబు


మంత్రి రవికుమార్‌కు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న లక్ష్మణరెడ్డి, గోపాల్‌రెడ్డి

వరద బాధితులకు భరోసాగా..

ఒంగోలు నుంచి మూడు లారీల ద్వారా సామగ్రి తరలింపు ● పలుచోట్ల నుంచి దాతల సాయంతో ఆహారం సరఫరా

విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు దాతలు, ప్రముఖులు ముందుకు వస్తున్నారు. సీఎం సహాయనిధికి విరాళాలను అందించడంతో పాటు వాహనాల ద్వారా ఆహారం, మంచినీరు, ఇతర సామగ్రిని తరలిస్తున్నారు..!

చెన్నుపాటి బ్రదర్స్ చేయూత

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 6: విజయవాడలో వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అక్కడి ప్రజలకు ఒంగోలుకు చెందిన చెన్నుపాటి బ్రదర్స్ తమ వంతు చేయూతనందించారు. ఈ మేరకు అవసరమైన దుప్పట్లు, లుంగీలు, ఇతర నిత్యావసరాలను అందించేందుకు మూడు లారీల ద్వారా విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా శుక్రవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దామచర్ల మీడియాతో మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనుకోకుండా వచ్చిన విపత్తుతో విజయవాడ అతలాకుతలం అయిందన్నారు. అయితే అక్కడి ప్రజలను ఆదుకునేందుకు టీడీపీ శ్రేణులు మానవత్వంతో ముందుకు వస్తున్నారని చెప్పారు. చెన్నుపాటి బ్రదర్స్ అయిన కార్పొరేటర్ చెన్నుపాటి వేణు, చెన్నుపాటి ప్రసాద్, చెన్నుపాటి శ్రీనివాసరావుతోపాటు, వారి వ్యాపార సంస్థల సిబ్బంది, స్నేహితులను దామచర్ల ప్రత్యేకంగా అభినందించారు.

సీఎంకు రూ.10లక్షలు చెక్కు అందజేత

విజయవాడలో వరద బాధితల కోసం కళ్యాణ్ ఆక్వా అండ్ మెరైన్ ఎక్స్‌పోర్ట్ ఇండియా ప్రవేట్ లిమిటెండ్ యాజమాన్యం ఒదుకు వచ్చింది. శుక్రవారం సంస్థ తరుపున ఎం.నరేంద్రబాబు రూ. 10లక్షలు చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజయవాడలో అందజేశారు. మద్దిపాడు మండలం కీర్తిపాడుకు చెందిన నరేంద్రబాబు దాతృత్వాన్ని చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.

శర్వాణి ఇండస్ట్రీస్ రూ.10లక్షలు

ఒంగోలు(కలెక్టరేట్): శర్వాణి ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గోపాల్‌రెడ్డి, జనచైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డిలతో కలిసి శుక్రవారం రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు రూ.10లక్షల చెక్కును వరద బాధితుల సహాయం కోసం అందజేశారు. తాడేపల్లిలోని మంత్రి రవికుమార్ నివాసంలో కలిసి ఈ చెక్కును అందజేశారు. ఈ చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించాలని కోరారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

ఉప్పుగుండూరు నుంచి..

నాగులుప్పలపాడు: విజయవాడ వరద బాధితుల కోసం మండలంలోని ఉప్పుగుండూరు రజక సంఘం తమ వంతు చేయూత నిచ్చారు. సంఘ అధ్యక్షులు కండ్లగుంట కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సభ్యులు 2,500 పులిహోర ప్యాకెట్లు, 1,200 వాటర్‌బాటిళ్లను సమకూర్చి వాటిని శుక్రవారం వాహనంలో విజయవాడ తీసుకెళ్ళి పంపిణీ చేశారు.

అండగా అరుంధతినగర్ యువత..

టంగుటూరు: విజయవాడ వరద బాధితులకు అండగా టంగుటూరు అరుంధతీనగర్ యువకులు మేమున్నామంటూ ముందుకొచ్చారు. 700 మంది బాధితులకు సరిపడ ఆహారాన్ని సిద్ధం చేశారు. టంగుటూరులోనే వరద బాధితులకు కావలసిన ఆహారం సమకూర్చి ప్రత్యేక వ్యాన్‌లో విజయవాడ తీసుకుపోయారు. వీరే స్వయంగా బాధితులకు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో బక్కా సుదర్శన్, బల్లి రాజు, గద్దల కిరణ్‌కుమార్, అంగలకుర్తి భాస్కర్, కొమ్ము భానుచందర్, శిఖ నాగరాజు, తలారి కోటేశ్వరరావు, భాస్కర్, శ్రీకాంత్, వంశీ, జాషువా, కళ్యాణ్, వంశీ ఉన్నారు.

రూ.50వేల విరాళం

కొండపి: విజయవాడ వరద బాధితులకు సాయంగా కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వసూలు చేసిన 50వేల రూపాయలను ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, తహసీల్దార్ పి. మురళిలకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వరద బాధితులకు తమ వంతు సాయంగా విద్యార్థులు విరాళాలు సేకరించారన్నారు. విద్యార్థులు స్పందించడం పట్ల ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి వారిని అభినందించారు. యాభై వేల రూపాయలను సీఎం సహాయనిధి అకౌంట్‌కు జమ చేస్తామని తహసీల్దార్ మురళి తెలిపారు.

టీడీపీ ఆధ్వర్యంలో బియ్యం సేకరణ

మద్దిపాడు: వరద బాధితుల కోసం మద్దిపాడు మండలం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మండల అధక్షుడు మండవ జయంత్‌బాబు నేతృత్వంలో గ్రామాల్లో శ్రేణులు బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా సుమారు 200 బస్తాలు సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఈ బియ్యాన్ని విజయవాడకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.


ఉప్పుగుండూరు నుంచి పులిహోర ప్యాకెట్లు తరలిస్తున్న రజక సంఘం నాయకులు



ఆహారం తరలిస్తున్న టంగుటూరులోని అరుంధతీనగర్ యువకులు


కొండపి తహసీల్దార్ కార్యాలయంలో విరాళం అందజేస్తున్న జీజేసీ విద్యార్థులు, అధ్యాపకులు

కార్పొరేషన్‌లో పని దొంగలకు చెక్

ఉదయం 10 గంటలకు ఆఫీసుకు రావాల్సిందే.. ● ఉద్యోగులను హెచ్చరించిన కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 6: ఒంగోలు నగరపాలక సంస్థలో నిర్లక్ష్య విధులకు చెక్ పెట్టేందుకు కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కమిషనర్ కార్యాలయంలోని రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇతర సెక్షన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సెక్షన్లలలోని సీట్లలో సిబ్బంది లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై నిర్లక్ష్య విధులకు స్వస్తి చెప్పాలని ఆదేశించారు. పౌరసేవలు సక్రమంగా అందించాలన్నారు. ప్రజలు పలు సమస్యలపై వచ్చినపుడు సీట్లలో లేకుండా ఉంటే పనులు ఎలా జరుగుతాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని ఆదేశించారు. ఇకపై ప్రతి ఒక్కరూ ఉదయం 10గంటలకు ఆఫీసుకు రావాలని తెలిపారు. ఆ తర్వాత 10-30 గంటకు రిజిస్టర్లు తన చాంబర్‌లో ఉంచాలని, కార్యాలయ వేళల్లో కచ్చితంగా తమ సీట్లలో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పలు సమస్యలపై విచ్చేసే అర్జీదారులను పదేపదే తిప్పించుకోవద్దన్నారు ఫీల్డు వర్క్‌కు వెళ్ళే ఉద్యోగులు కచ్చితంగా మూమెంట్ రిజిస్టరు పాటించాలని, ప్రజల నుంచి ఫిర్యాదుల వచ్చినా, విధుల్లో అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అదేవిధంగా ఆయా సెక్షన్లలో ఫైళ్ళు భద్రంగా ఉంచకపోవడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. అలాగే ప్రతి సెక్షన్‌లోనూ పరిశుభ్రత పాటించాలన్నారు. కార్పొరేషన్ కార్యాలయం కార్పొరేట్ స్థాయి కార్యాలయంగా ఉంచాలని సూచించారు. తాను సెక్షన్ల వారీగా సమీక్షలు నిర్వహిస్తామనని, ఏ రోజుకారోజు నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలని ఉద్యోగులకు ఆయన సూచించారు.


కొత్త మార్కెట్‌లో ఆక్రమణలను తొలగింపజేయిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

నగరంలో మురుగునీటి పారుదల వ్యవస్థకు అడ్డంకిగా ఉన్న ప్రాంతాలలో కమిషనర్ వెంకటేశ్వరరావు శుక్రవారం పర్యటించారు. ఈ మేరకు పాత కూరగాయల మార్కెట్ సెంటర్‌లో ఫుట్‌పాత్‌లు, కాలువలు ఆక్రమణలు చేసి వ్యాపారాలు చేస్తున్న వాటిని తొలగించారు. ఇకపై నగరంలో రోడ్లపైన అమ్మకాలు జరుపుకునేవారు కార్పొరేషన్ అధికారుల అనుమతితో నిర్వహించాలన్నారు. అలాగే మురుగునీటి పారుదల వ్యవస్థకు అడ్డంకి లేకుండా చూడాలని, శానిటేషన్ సిబ్బంది కూడా ప్రతి రోజు కాలువల్లో పూడిక తీయాలని ఆదేశించారు.

పశువులను 5 కి.మీ దూరంలో ఉంచాలి

నగరంలోని పందులు, ఆవులు, ఇతర పశువులను పెంచే యజమానులు వాటిని నగరానికి 5 కి.మీ దూరంలో పెంచుకోవాలని కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధుల ప్రబలకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే నగరంలో పశువులు రోడ్లపై తిరగడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని, పందులు సంచారం వల్ల ప్రజలకు ఫ్లూ, మెదడువాపు వ్యాధి, లెప్టోస్పిరోసిస్, టాక్సోప్లాస్మోసిస్, బ్రూసెల్లోసిస్, తులరమేయా, ట్రైకినెలోసిస్, స్వైన్ ఇన్‌ఫ్లూ ఎంజా, సాల్మొనెల్లా, హెపటైటిస్, ఇ.కోలి లాంటి భయంకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. యజమానులు కార్పొరేషన్ అధికారుల ఆదేశాలను నిర్లక్ష్యం చేస్తే చట్టపరిధిలో తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయాన్ని పశువుల యజమానులు రెండు రోజుల్లో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన ఆదేశించారు.

క్విస్‌లో ముందస్తు వినాయకచవితి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 6: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ముందస్తు వినాయకచవితి వేడుకలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వినాయక ప్రతిమల రూపకల్పన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు అందరూ మట్టితో తయారు చేసిన విగ్రహాలను వాడి కృత్రిమ రంగులకు దూరంగా ఉండాలన్నారు. భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుని పూజించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్‌ఛైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రిదేవి తదితరులు పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో పది అడుగుల వినాయక మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేసి ప్రసాదాలను పంపిణీ చేశారు.


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

క్రీడాకారిణికి ఆర్థికసాయం

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 6: ఒంగోలు నగరానికి చెందిన పేద క్రీడాకారిణి రామతులసికి ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ సహకారంతో రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శుక్రవారం స్థానిక కర్నూల్ రోడ్ సూర్యశ్రీదివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ బాష, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు చేతులమీదుగా నగదును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ప్రగతికాలనీకి చెందిన రామతులసి అథ్లెటిక్స్, వాలీబాల్‌లో రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించి రాణిస్తున్నారని చెప్పారు. ఈ నెల చివరలో మలేషియాలో జరుగనున్న ఇంటర్నేషనల్ ఓపెన్ అథ్లెటిక్స్‌లో పాల్గొనేందుకు ఆమెకు అవకాశం లభించిందని, అయితే ఆర్థిక ఇబ్బందులను ట్రస్ట్ దృష్టికి తీసుకురాగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మండవ మురళీకృష్ణ ఆర్థిక సహాయాన్ని అందజేశారన్నారు.


రామతులసికి చెక్కును అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

నామమాత్రంగా మండల సమావేశం

సింగరాయకొండ, సెప్టెంబర్ 6 : సింగరాయకొండలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. స్థానిక సంస్థల ప్రజప్రతినిధులు కూడా సగభాగం గైర్హాజరయ్యారు. దీంతో గ్రామాలలోని సమస్యలపై చర్చజరగకుండానే సమావేశం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కట్టా శోభారాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో నరసింహమూర్తి, కోఆప్షన్ సభ్యుడు సర్దార్, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలంలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీక్లబ్ వారోత్సవాలు

ఒంగోలు (కల్చరల్), సెప్టెంబర్ 06: వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కె.చంద్రశేఖరగుప్తా జయంతి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఒంగోలు నగరం అమలనాధునివారివీధిలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో క్లబ్ సభ్యులు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం వాసవీక్లబ్, వాసవీ కేసీజీఎఫ్, వాసవీ వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో పాత్రికేయులు పొన్నూరి వేంకటశ్రీనివాసులు, మాగంటి శ్రీనివాసమూర్తి, సూరపరాజు రాముశర్మ, లంకా ప్రసన్నకుమార్, బాల చెన్నయ్య, నూకతోటి శరత్‌బాబు, చింతం కోటివీరయ్య రాధా రమణ గుప్తా జంధ్యం, బాబు తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో జి.బ్రహ్మానందం, వినోద్‌కుమార్, బదరీనారాయణ, మనోహర్, భూమా శ్రీనివాసులు, కృష్ణ, హరిప్రసాదరావు, రంగస్వామి పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ప్రజాప్రతినిధుల వినాయకచవితి శుభాకాంక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 6: జిల్లాలోని ప్రజలకు ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్రవారం వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. మట్టితోచేసిన విఘ్నేశ్వరస్వామిని తొమ్మిదిరోజుల పాటు ప్రజలందరూ నిష్ఠతో పూజించి, పండుగను సంప్రదాయంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రజల జీవితాలు ఆనందమయంగా ఉండాలని, పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

ఒంగోలు (కార్పొరేషన్) : ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తలపెట్టిన ప్రతి కార్యం గణనాథుని ఆశీస్సులతో విజయం సిద్ధించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 6: ఉప్పుగుండూరులోని అంగన్‌వాడీకేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడుతూ ఏడో నెల నుంచి మూడో ఏడాది వయసు గల చిన్నారులకు తల్లులు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలన్నారు. పోషకార లోపాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నదని చెప్పారు. చిరుధాన్యాలు, గుడ్లు, పాలు, ఆకుకూరలు తప్పక తీసుకోవాలని సూచించారు. అంగన్‌వీడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పాలు, గుడ్లు, బాలామృతం అందిస్తామని, తద్వారా చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని అధిగమించవచ్చని పేర్కొన్నారు. పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ప్రమీల

రేపు సర్పంచ్‌ల సంఘం సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 6 : జిల్లా సర్పంచ్‌ల సంఘం సమావేశం ఆదివారం ఒంగోలులోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో జరుగుతుందని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సర్పంచ్‌లందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 6: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ ఆధ్వర్యంలో బీటెక్ నాల్గవ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ షేక్ మస్తాన్‌వలి విద్యార్థులకు ఇంటర్వ్యూలు ఎదుర్కొనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, విభాగాధిపతి ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

అండర్-9 చెస్ చాంపియన్‌షిప్ పోటీలు రేపు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 6: ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని దాసరి మిను చెస్‌హౌస్‌లో ఈనెల 8న జిల్లా స్థాయి అండర్-9 చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ షేక్ అబ్దుల్‌రబీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు వేర్వేరుగా ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 9666725719 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

వరద బాధితులకు రూ.60వేల విరాళం : సీపీఐ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 6 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సేకరించిన రూ.60వేలను సహాయ నిధికి అందజేస్తున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి పీవీఆర్.చౌదరి తెలిపారు. ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరం మునిగిపోయి ధనికులు, పేదలు అనే తేడా లేకుండా అందరూ కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారన్నారు. మానవతా దృక్పథంతో ఆదుకునేందుకు తమవంతు సహకారంగా విరాళాలు సేకరించినట్లు తెలిపారు కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, ఇన్నాఫ్, ఎంఎ.సలార్, ఉప్పుటూరి ప్రకాశరావు, కె.అంజయ్య, కారుమూడి నాగేశ్వరరావు, పీవీ.కృష్ణారావు, పాటికొండ సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీవీఆర్.చౌదరి

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 6: రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త జి.ప్రసాద్‌బాబు సూచించారు. రిలయన్స్ ఫౌండేషన్, కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను మండల పరిధిలోని తిమ్మసముద్రం, ఉప్పుగుండూరు, కనపర్తి గ్రామాలకు చెందిన రైతులతో శుక్రవారం నిర్వహించిన మల్టీలోకేషన్ ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్త మాట్లాడారు. వరి పంటలో జీవన ఎరువుల వాడకం, ఉల్లికోడు, నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.యాకోబు, పి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కూటమి నాయకుల విరాళాల సేకరణ

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 6 : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు టీడీపీ కూటమి నాయకులు ఉప్పుగుండూరు గ్రామంలో శుక్రవారం రాత్రి విరాళాలు స్వీకరించారు. కార్యక్రమంలో కనగాల శ్రీనివాసరావు, బి.సెల్వం, నాగమల్లేశ్వరావు, పెంట్యాల కోటేశ్వరరావు, పెంట్యాల శ్రీనివాసరావు, జాన్సన్, బెల్లం శ్రీను, శ్రీకాంత్, కొంజేటి రామకృష్ణ, వాసు, మసిముక్కు భాస్కర్ పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న నాయకులు

మైనర్ బాలికను వేధిస్తున్న ఆకతాయిపై కేసు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 6: మైనర్ బాలికను వేధిస్తున్న ఆకతాయిపై ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. రెండేళ్ల క్రితం బాలిక పదో తరగతి చదువుతున్న సమయంలో ఒంగోలు నగరం వడ్డివానికుంటకు చెందిన పెద్దా బాబు పరిచయమయ్యాడు. అతడిపై తాలుకా పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీటు ఉండటం, అతని ప్రవర్తనపై అనుమానింతో సదరు బాలిక మాట్లాడటం మానేసింది. అయితే అప్పటి నుంచి బాలిక వెంటపడుతున్న బాబు తనతో ఫోన్ మాట్లాడాలంటూ వత్తిడి తెస్తున్నాడు. లేకుంటే తనను, తల్లిదండ్రులను చంపుతానని బెదిరిస్తున్నాడు. అంతేగాకుండా ఇంటికి వచ్చి గొడవ చేస్తానని వేధిస్తున్నాడు. అయితే బాలిక కాలేజీలో చదువుతూ ఇతర ప్రాంతంలో ఉంటుంది. గత నెలలో సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చింది. ఈనెల 4న బాలిక వెంట పడిన బాబు చంపేస్తానని బెదిరించాడు. ఈమేరకు బాలిక తల్లిదండ్రులు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెల్లంపల్లిలో స్కూలు బస్సు బోల్తా

● త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

మద్దిపాడు, సెప్టెంబరు 6: మద్దిపాడు మండలం వెల్లంపల్లి-కొలచనకోట గ్రామాల సమీపంలో శుక్రవారం ఇరుకైన టర్నింగ్ వద్ద స్కూల్ బస్సుకు బ్రేక్ ఫెయిల్ అయి అదుపుతప్పింది, దీంతో రహదారి మార్జిన్‌లోని చిల్లచెట్లలో దూసుకుపోయి ఆగింది. ఈ సమయంలో బస్సులో 15 మంది విద్యార్థులు ఉండగా పి.శ్రీవేద(7) బాలికకు స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన విద్యార్థులకు ఎటువంటి గాయాలు కాకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గుండ్లాపల్లి గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సు శుక్రవారం మద్దిపాడు మండలంలోని పలు గ్రామాల విద్యార్థులను ఎక్కించుకుని వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్సై బి.శివరామయ్యలు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.


స్థానికులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

రేషన్ డీలర్ దందాకు అడ్డుకట్ట వేయండి

● ధర్నాకు దిగిన టీడీపీ నాయకుడు

చీమకుర్తి, సెప్టెంబరు 6 : మండలంలోని గాడిపర్తివారిపాలెంలో జరుగుతున్న రేషన్ దుకాణం అక్రమ వ్యవహారాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నారిపెద్ది వెంకట్రావు శుక్రవారం చీమకుర్తి తహసీల్దార్ కార్యాయలం ముందు ధర్నా నిర్వహించారు. ఆయనకు పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా డీలర్‌ని అధికారులు నియమించటంతోనే ఈ సమస్య తలెత్తిందని, అర్హతలు ఉన్నవారు దరఖాస్తు చేసుకున్నా వారిని కాదని అధికారులు తమ ఇష్టానుసారం నియమించారని ఆరోపించారు. వెంటనే డీలర్‌ని తొలగించి అక్రమ వ్యవహారలకు అడ్డుకట్ట వేయాలని తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందచేశారు. తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఇచ్చిన హామి మేరకు వెంకట్రావు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందిమళ్ల గంగాధరరావు, కొత్రపు రాఘవరావు, కాట్రగడ్డ రమణయ్య, సూరంపల్లి హనుమంతరావు, మన్నం శేషయ్య, గోనుగుంట రామాంజనేయులు, మణిమేల అంజయ్య, గమిని ఆంజనేయులు, మందలపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు6: జిల్లా ప్రజలతోపాటు పోలీసు సిబ్బందికి ఎస్పీ దామోదర్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రజలు సుఖశాంతులతో పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పోలీసుల నిబంధనల మేరకు గణేష్ ఉత్సవాలు చేసుకోవాలని కోరారు. ఎలాంటి సమస్యలు తలెత్తిన్నా వెంటనే 112, 100 ఫోన్ నంబర్లుకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రావయ్యా..గణనాయకా..!

వినాయక నవరాత్రులకు ఏర్పాట్లు పూర్తి

పూలకు, పండ్లకు, పురోహితులకు పెరిగిన డిమాండ్

నేడు వినాయక చవితి పండుగ



క్రేన్ సాయంతో విగ్రహాన్ని తరలిస్తున్న నిర్వాహకులు



వినాయక ప్రతిమలు కొనుగోలు చేసి తీసుకెళుతున్న మహిళలు

ఒంగోలు (కల్చరల్), సెప్టెంబరు 6: వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఒంగోలు నగరంతో పాటు పలు ప్రాంతాలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే పందిళ్లు వేసి, వాటిని విద్యుద్దీపాలతో అలంకరించి, భారీ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా నగరంలోని రాజాపానగల్ రోడ్, రంగుతోట, గాంధీరోడ్డు, సీతారాంపురం, లాయర్‌పేట, వీఐపీ రోడ్, కర్నూల్ రోడ్, నెల్లూరు బస్టాండ్, సంతపేట, రామ్‌నగర్, హౌసింగ్ బోర్డు కాలని, మంగమూరురోడ్డు, బైపాస్ రోడ్డు మొదలైన ప్రధాన కూడళ్లలోనే కాకుండా చిన్న చిన్న వీధుల్లో సైతం నవరాత్రులకు ఏర్పాట్లు జరిగాయి. అటు ఉత్తర బైపాస్ ఫ్లైఓవర్ దగ్గరు ఉన్న విఘ్నేశ్వర స్వామి దేవస్థానం, నెల్లూరు బస్టాండులోని శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానంలోను నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించానికి ఏర్పాట్లు జరిగాయి. మరోవైపు వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు ఆటోలలో తీసుకెళ్లే వారితో శుక్రవారం నగరం రద్దీగా మారింది. గణపతి బొప్పా మోరియా అంటూ నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు సైతం ఒంగోలు నుంచి వినాయక విగ్రహాలను తీసుకెళ్లారు.

అమ్మకానికి వినాయక ప్రతిమలు, పత్రి



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న రోడ్డు

వినాయక చవితి సందర్భంగా ఇళ్లలో పూజలు చేసుకునేందుకు వీలుగా వినాయక ప్రతిమలు, పత్రీ, పాలవెల్లి, గొడుగు వంటివి శుక్రవారం సాయంత్రం నుంచే నగరంలోని పలుప్రాంతాల్లో అమ్మకానికి సిద్ధమయ్యాయి. చాలా ప్రదేశాల్లో ప్రజలు వీటిని కొనుగోలు చేయటం కనిపించింది.

పూలకు పెరిగిన డిమాండ్

సహజంగానే పండుగ వచ్చిందంటే పూలకు డిమాండ్ ఉంటుంది. అందులో వినాయక చవితి పండుగలో పూలకు మరింత గిరాకీ. నగరంలోని పలు చోట్ల ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలకు ప్రతిరోజు పూలదండలు ఉపయోగిస్తుంటారు. దీంతో ఇప్పటికే మార్కెట్‌లో 5, 10, 12, 15 అడుగుల గజమాలలు, అడుగు నుంచి మూడడుగుల పొడవైన పూలదండలు సిద్ధమయ్యాయి. అయితే ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడటంతో వీటి ధరలు సైతం ఎక్కువగానే ఉన్నాయి. గజమాల ధరలు సైజును బట్టి రూ.2వేల నుంచి రూ.4వేల వరకు కూడా పలుకుతోంది. అదేవిధంగా పూలదండలు సైతం రూ.150 నుంచి రూ.500 వరకు పలుకుతున్నాయి.

కళాకారులకు పెరిగిన డిమాండ్

మరోవైపు నవరాత్రుల సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలు పందిళ్లలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుండటంతో కళాకారులకు డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా పాటకచ్చేరి, డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలు చేసే కళాకారులు రోజుకు రెండు మూడు ప్రోగ్రాంలు చేయాల్సిన పరిస్థితి. అదేవిధంగా మైకు,



మట్టి ప్రతిమలను పంచుతున్న నిర్వాహకులు

లైటింగ్, స్టేజి, డెకరేషన్ రంగాల వారికీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేతినిండా పని దొరుకుతోంది. ఇటీవలి కాలంలో కేవలం పందిళ్లలోనే కాకుండా పలు అపార్టుమెంట్లలో సైతం విగ్రహాన్ని పెట్టి నవరాత్రులు చేస్తుండటంతో వారికీ డిమాండ్ బాగా ఏర్పడింది.

కేటరింగ్ వారికి చేతినిండా పని

అటు కేటరింగ్ చేసే వాళ్లకు సైతం ఈ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేతినిండా పని ఏర్పడింది. పందిళ్లలో ప్రతి రోజు భక్తులకు పంపిణీ చేసేందుకు ప్రసాదల తయారీ, అన్నదాన కార్యక్రమాల్లో భోజనాల తయారీ వంటి వాటికి ఇప్పటికే నగరంలోని పలు కేటరింగ్ ఏజెన్సీలకు పుష్కలంగా ఆర్డర్లు లభించాయి.

కిక్కిరిసిన వస్త్రదుకాణాలు

మరోవైపు పండుగ సందర్భంగా కొత్త దుస్తులు కొనుగోలు చేసే వారితో నగరంలోని పలు వస్త్రదుకాణాలు కిక్కిరిశాయి. గాంధీరోడ్డు, బాపూజీ మార్కెట్ కాంప్లెక్సు, ట్రంకురోడ్డు, కర్నూల్ రోడ్డులోని పలు వస్త్రదుకాణాలు గత నాలుగైదు రోజులుగా కొనుగోలుదారులతో కళకళలాడాయి. కొనుగోలు దారులను ఆకర్షించేందుకు వస్త్ర వ్యాపారులు పోటీపడి అనేక ఆఫర్లను ప్రకటించారు.

వల్లూరులో..

టంగుటూరు : వినాయక చవితినాడు పర్యావరణ హిత వినాయకుని వినియోగించాలని వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సంకల్పించారు. విద్యార్థుల చేత 100 మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించారు. వాటన్నింటినీ విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మందాడి రమణయ్య, జీవశాస్త్ర ఉపాధ్యాయిని నివేదిత, గోపాల్‌రెడ్డి, మహేశ్వరరావు పాల్గొన్నారు

కొండపిలో..

కొండపి: వినాయక చవితి సందర్భంగా శనివారం చవితి పూజలకు గణనాథులు భారీగా తరలివెళుతున్నారు. కొండపిలోని రాజస్థాన్ కళాకారులు తయారు చేసిన గణపయ్య ప్రతిమలను యువకులు శుక్రవారం కొనుగోలు చేసి మండపాలకు ఉదయం నుంచే తరలించారు. దీంతో కొండపిలోని మద్దులూరు రోడ్డు గణనాథులను తీసుకెళ్లేందుకు ట్రాక్టర్‌లలో వచ్చిన యువకులతో సందడిగా మారింది. గణనాథలను బాణసంచా కాలుస్తూ, గులాములు చల్లుకుంటూ తమ తమ గ్రామాల్లోని మండపాలకు తరలించారు.

ఓరియంట్ క్వారీలో విరిగిపడిన హైవాల్

8మంది కార్మికులు మృతి చెందారనే వదంతులు ● క్వారీని పరిశీలించిన ఎస్పీ దామోదర్



హైవాల్ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్



చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

చీమకుర్తి, సెప్టెంబరు 6 : రామతీర్థం సమీపాన ఉన్న ఓరియంట్ గెలాక్సీ గ్రానైట్ క్వారీలో శుక్రవారం పెను ప్రమాదం చోటుచేసుకుంది. 2009 సంవత్సరంలో హంసా గ్రానైట్ క్వారీలో జరిగిన సంఘటన మాదిరే ఇక్కడ కూడా ఇలాంటే సంఘటన జరిగింది. అయితే ఈ క్వారీలో ఉత్పత్తి పనులు జరుగుతుండకపోవటంతో ఎలాంటి ప్రాణప్రమాదం లేదని తెలుస్తున్నది. అయితే సంఘటనా స్థలంలో ఉత్పత్తికి ఉపయోగించే వాహనాలు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎనిమిది కార్మికులు హైవాల్ పడినచోట మట్టిపెళ్లలు, రాళ్ల కింద సజీవసమాధి అయి ఉంటారనే వార్తలు షికారు చేస్తున్నాయి. ఈ విషయాన్ని క్వారీ యాజమాన్యం అయిన కృష్ణసాయి గ్రూపు ఆఫ్ కంపెనీస్ ఖండించింది. ఈ క్వారీలో ఉత్పత్తి ప్రక్రియ నిలిచిపోయి ఏడాది దాటుతుందన్నారు. కాగా నిబంధనల విరుద్ధంగా చేస్తున్న కార్యకలాపాల వల్లే ఇటువంటి ప్రమాదాలు క్వారీల్లో జరుగుతున్నాయి. హైవాల్స్ తొలగించాల్సిన బాధ్యత క్వారీ యాజమాన్యంపై ఉంది. వాటిని తొలగించటంలో నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలకు కారణమవుతుంది. కాగా ఓరియంట్ క్వారీలో జరిగిన ప్రమాదంపై మైన్స్ డీడీని ఆంధ్రజ్యోతి వివరణ కోరాగా, ఆ క్వారీలో ఉత్పత్తి నిలిచిపోయి ఏడాది అవుతుందన్నారు. ఎటువంటి ప్రాణప్రమాదం జరగలేదని చెప్పారు. సీఐ సుబ్బారావు స్పందిస్తూ ఈ సంఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదన్నారు.

ఎస్పీ సందర్శన : క్వారీ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందారనే వార్తలు షికార్లు చేయటంతో ఎస్పీ దామోదర్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును ఆరా తీశారు. అనంతరం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి క్వారీల్లో ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్వారీ ఓనర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. వినాయకచవితి వేడుకలు ప్రశాంతంగా జరిగే చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ సుబ్బారావు ఉన్నారు.

బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర చాంపియన్‌గా చీమకుర్తి క్రీడాకారుడు

చీమకుర్తి, సెప్టెంబరు 6 : ఏపీ స్టేట్ అండర్-19 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో చీమకుర్తికి చెందిన ఖరామత్ ఉల్ హక్ మహ్మమద్ విజేతగా నిలిచి జాతీయపోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం శ్రీకాకుళంలో జరిగిన పోటీల్లో ఖరామత్ మిక్స్‌డ్ డబుల్స్‌లో దీపిక దేవనబోయినతో కలిసి విజయం సాధించారు. దీంతో భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ఆయన ప్రాతినిథ్యం వహించనున్నారు. ఖరామత్ చీమకుర్తికి చెందిన ప్రముఖ షటిల్ క్రీడాకారుడు షేక్ కరీముల్లా కుమారుడు. స్థానిక చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్‌స్టేడియంలో షటిల్‌లో ఓనమాలు దిద్దిన ఖరామత్ నేడు స్టేట్ చాంపియన్‌గా నిలవటం పట్ల చెరుకూరి రఘుకిరణ్, మన్నం నాగరాజుతోపాటు పలువురు క్రీడాకారులు అభినందించారు.

దక్షిణంబజార్ యూత్ ఆధ్వర్యంలో భారీ గణనాథుడు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 6: వినాయకచవితి సందర్భంగా ఒంగోలు నగరం దక్షిణబజార్‌లో ఏర్పాటు చేసిన 33 అడుగుల భారీ వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన కళాకారులు ఈ భారీ విగ్రహాన్ని పూర్తిగా మట్టితో తయారుచేశారు. శనివారం సాయంత్రం ఆవిష్కరిస్తామని వినాయక బాలభక్త సమాజ కమిటీ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు.






కంభంలో మండపాలకు తరలుతున్న వినాయకుడు, మార్కాపురంలోని వినాయకుని విగ్రహాలు, మట్టి ప్రతిమలు అందజేస్తున్న మార్కాపురం సీఐ వెంకటేశ్వర్లు, గిద్దలూరులో అందజేస్తున్న సీఐ సురేష్

కదలిరావయ్యా.. బొజ్జగణపయ్యా

- గ్రామాలకు తరలుతున్న వినాయకులు
- పలుచోట్ల మట్టి విగ్రహాల పంపిణీ
- సిద్ధం చేసుకున్న మండపాలు

కంభం, సెప్టెంబరు 6 : వినాయక చవతి పర్వదినం సందర్భంగా కంభం, అర్థవీడు, బేస్తవారపేట మండలాల్లో వందల సంఖ్యలో వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. ఒక్క కంభం మండలంలోనే ఒక్కో వీధిలో 2, 3 విగ్రహాల చొప్పున 200కు పైగా మండపాలను ఏర్పాటు చేసుకున్నారు. ఆయా మండపాలకు రెండు రోజుల నుంచి గ్రామాలకు గణనాథులను తరలిస్తూనే ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుండే మండపాల వద్ద గణనాథులను తరలిస్తున్నారు. శనివారం వినాయక చవితి పర్వదినం రోజున స్వామివారిని భక్తిశ్రద్ధలతో కొలిచిన అనంతరం మూడవరోజు ఆదివారం భారీపోలీసు బందోబస్తు మధ్య గణనాథులను వాహనాల్లో తరలించి కంభం చెరువులో నిమజ్జనం చేయనున్నారు. కంభం చెరువులో పుష్కలంగా నీరు ఉండడంతో మండపాల ఏర్పాటు ఎక్కువగా ఉంది. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ రామకోటయ్య సూచించారు.

ముస్తాబైన గణేష్ విగ్రహాలు

బేస్తవారపేట : మండలంలోని నేడు జరిగే వినాయక చవితి పండుగ సందర్భంగా వీధివీధిన విగ్రహాలు ఏర్పాటుకు సిద్ధమయ్యారు. కంభం చెరువులో పుష్కలంగా నీరు ఉండడంతో వినాయక నిమజ్జనానికి కంభం చెరువులో అధికారులు తగు ఏర్పాటు చేస్తున్నారు

మార్కాపురం వన్‌టౌన్ : వినాయక చవితిని పురస్కరించుకొని నవరాత్రులు నిర్వహించేందుకు మార్కాపురం పట్టణంలో మండపాలు సిద్ధం అవుతున్నాయి. భారీ సెట్టింగ్‌లు, రంగురంగుల తోరణాలతో మండపాలు సిద్ధం చేశారు. వివిధ సైజులలో వినాయక విగ్రహాలను ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేశారు. పట్టణంలోని రథం బజార్ వినాయక స్వామి ఆలయం వద్ద, నెహ్రూ బజార్, మున్సిపాలిటీ, నాయుడుబజార్ తదితర ప్రాంతాలలో గణేష్ మండపాలను విశేషంగా తీర్చిదిద్దారు.

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని పాతబస్టాండ్ లో బీజేపీ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మట్టి వినాయకుని పూజించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. పట్టణ ఎస్ఐ సైదుబాబు, బీజేపీ నాయకులు కృష్ణారావు, పి.శ్రీనివాసరావు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం

కొమరోలు : ప్రజలు వినాయక చవితి పర్వదినాన మట్టివినాయకున్ని పూజించాలని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం పాఠశాలల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మట్టి వినాయకుల ప్రతిమలను తయారుచేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నారాయణరెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలన్నారు. కలుషితమైన రంగులు కలిపిన వినాయకుని విగ్రహాలను వాడడం వల్ల నీరు, గాలి కలుషితం అవుతున్నాయన్నారు. పకృతిని కలుషితం చేయడం వల్ల మానవ మనుగడ, జీవరాసుల మనుగడ కష్టంగా మారుతుందన్నారు. గణనాథులను గిద్దలూరు, కంభం, పోరుమామిళ్ల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సి రావడంతో ప్రజలకు అధిక వ్యయప్రయాశాలు పడుతున్నారు. కొమరోలు పట్టణంలోని చెక్‌పోస్టు సమీపంలో ఆరడుగుల ఎత్తైన మట్టిగణనాథున్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

పుల్లలచెరువు : వినాయక చవితికి ఏర్పాటు చేసే వినాయక విగ్రహ మండపాలకు నిర్వహకులు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై బత్తుల బాబురావు అన్నారు.శుక్రవారం మండల కేంద్రమైన పుల్లలచెరువులోని పోలీస్ స్టేషన్‌లో నాయక మండలపాల నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకచవితి పండుగను శాంతియుతంగా సోదర భావంతో వైభవంగా జరుపుకోవాలన్నారు. రోడ్డుపై ఏర్పాటు చేసిన విగ్రహాల మండలపాల వద్ద విద్యుత్ ఏటువంటి ప్రమాదం లేకుండా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పరిమితికి మంచి లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దన్నారు. ముందుగా పుల్లలచెరువు జేడ్పీ పాఠశాలలో జరిగిన అవగహన సదస్సులో భాగంగా విద్యార్థులకు 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'పై అవగహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రాధాకృష్ణ, పుల్లలచెరువు గ్రామ పెద్దలు గజ్వెల్లి భాస్కర్,ఆకుల వెంకటేశ్వర్లు ,తదితరులు పాల్గొన్నారు.

అగ్గిపుల్లలతో వినాయకుడు

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణానికి చెందిన నటుకుల తులసీప్రసాద్ తయారు చేసిన వినాయకవిగ్రహం ఆకట్టుకుంటుంది. మొత్తం 23450 అగ్గిపుల్లలు వినియోగించి వినాయకుని ప్రతిమను తయారుచేశారు. అది విశేషంగా ఆకట్టుకుంటుంది.

గిద్దలూరు టౌన్ : మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని అర్బన్ సీఐ సురేష్ అన్నారు. హిందూ ధార్మిక సంస్థలు, దాతల సహకారంతో సమకూర్చిన మట్టి వినాయక ప్రతిమలను పట్టణంలోని అభయాంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో సీఐ పంపిణీ చేశారు. పర్యావరణానికి నష్టం కలగకుండా మట్టి వినాయకులను పూజించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యర్రారెడ్డి, సోమయ్య, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించాలి

కంభం, సెప్టెంబరు 6 : మండలంలోని జంగంగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టివినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని పరిక్షించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





మట్టిగణనాథులతో ఎస్‌బీఎస్ఆర్ఎం విద్యార్థులు, అగ్గిపుల్లలతో వినాయకుడు, మండపాల నిర్వహణపై సూచనలిస్తున్న ఎస్సై బాబూరావు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి యగ్నిక్



ఆయిల్‌బాల్స్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెద్దదోర్నాల, సెప్టెంబరు 6: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతల వైద్యాధికారి యగ్నిక్ అన్నారు. దోర్నాల లోని షిరిడి సాయిబాబా మందిరం సమీపంలోని మురికినీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల ద్వారా లార్వాలు వృద్ధి చెందకుండా ఉండేందుకు ఆయిల్ బాల్స్, అబెట్ ఆయిల్‌ను శుక్రవారం చల్లించారు. ఈ సందర్భంగా డాక్టర్ యగ్నిక్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నందున వ్యాధులువ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. దోమ తెరలు వాడాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయానికి తాళం వేసిన ఉద్యోగులు



తాళం వేసి ఉన్న సచివాలయం

మార్కాపురం రూరల్ సెప్టెంబరు 6 . మండలంలోని గజ్జలకొండ ఒకటవ సచివాలయానికి అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు తాళం వేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకొంది. గజ్జలకొండ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కుందురు శ్రీనివాసరెడ్డికి అదే సచివాలయ పరిధిలోని పడమటిపల్లి గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డితో ఘర్షణ జరిగింది. దళిత వర్గానికి చెందిన మహిళ పెన్షన్ ఇవ్వాలని, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డిని అడగగా నిర్లక్ష్యపు సమాదానం చెప్పడంతో మాటామాటా గొడవ జరిగినట్లు తెలిసింది. దీంతో గురువారం ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై ఎంపీడీవో చందనను వివరణ కోరగా, పోలీసుల సచివాలయ సిబ్బందిని స్టేషన్‌కు పిలవడంతో వెళ్లారని, సాయంత్రం సచివాలయం తెరిచారని వివరణ ఇచ్చారు.

10 నుంచి కేవీపీఎస్ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 6: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా శిక్షణ తరగతులు ఈ నెల 10, 11 తేదీలలో మార్కాపురం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు రాజు, కార్యదర్శి రఘురాములు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమాజంలో అట్టడుగు వర్గాలుగా ఉన్న గిరిజనులు, దళితులు ఆత్మగౌరవంతో ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో సమానత్వం సాధించాలని కేవీపీఎస్ ఉద్యమిస్తోందన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు నాగయ్య, నాగరాజు, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన సీఐ



విధుల్లో చేరిన సుబ్బారావు

మార్కాపురం, సెప్టెంబరు 6: మార్కాపురం నూతన సీఐగా పి.సుబ్బారావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మార్కాపురం సీఐగా సుబ్బారావును నియమిస్తూ రేంజ్ ఐజీ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో మార్కాపురం పట్టణ ఎస్సైగా పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడ సీఐగా పనిచేస్తున్న ఆవుల వెంకటేశ్వర్లు డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయనున్నారు. విధుల్లో చేరిన నూతన సీఐ సుబ్బారావును సర్కిల్ పరిధిలోని ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావు, రాజమోహనరావులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు గుండుపందెం

గిద్దలూరు, సెప్టెంబరు 6 : మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా శనివారం మధ్యాహ్నం 3గంటలకు గుండుపందెం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ.3వేలు, 2వ బహుమతిగా రూ.2వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనేవారు 9000448712, 9989459737 సంప్రదించాలన్నారు.

జాతీయ రహదారిపై ఆక్రమణల పరిశీలన

నేటికీ నష్టపరిహారం ఇవ్వలేదని బాధితుల ఆందోళన



బాధితులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

కంభం, సెప్టెంబరు 6 : కంభం జాతీయ రహదారి డ్రైనేజీలను ఆక్రమించుకొని నిర్మించిన అక్రమ కట్టడాలను మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకటత్రివినాగ్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ రహదారులను, డ్రైనేజీలను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కట్టిన అక్రమ కట్టడాలను తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. సబ్‌కలెక్టర్ జాతీయ రహదారి విభాగం అధికారులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. హీరో షోరూం వద్ద నుంచి జాతీయ రహదారికి ఇరువైపులా అక్రమ కట్టడాలను పరిశీలించారు. అనంతరం వైజంక్షన్‌లో నిర్మించిన అక్రమ కట్టడాలను పరిశీలించారు. విశ్రాంత ఉపాధ్యాయులు పిడతల సుధాకర్‌రెడ్డి, చెరుకుపల్లి శివశంకర్‌లు సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతూ తమ స్థలాలను తీసుకొని జాతీయ రహదారి నిర్మించారన్నారు అయినా నేటికీ అధికారులు తమకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. రెవెన్యూ అధికారులకు, జాతీయ రహదారి విభాగం అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితంలేదన్నారు. తాము భవన నిర్మాణం చేపట్టినప్పుడు హద్దులు చూపలేదన్నారు. అలాగే రహదారి వెంబడి కాలువల నిర్మాణాలు సక్రమంగా ఏర్పాటు చేయలేదన్నారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డుకిరువైపులా కొలతలు వేసి అక్రమ కట్టడాలు తొలగించడంతోపాటు ఇప్పటివరకు అందని నష్టపరిహారాన్ని అందేలా చేస్తానని హామీ ఇచ్చారు.

జాతీయ రహదారి భూముల పరిశీలన

త్రిపురాంతకం : మండలంలోని పలు గ్రామాలలోని జాతీయ రహదారి భూములను మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ శుక్రవారం పరిశీలించారు. దూపాడు, వెల్లంపల్లి, గొల్లపల్లి, రాజుపాలెం, త్రిపురాంతకం, మేడపి, గుట్లఉమ్మడివరం గ్రామాల నుంచి వెళుతున్న 544డీ జాతీయ రహదారిని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. రహదారి భూములలో పలు చోట్ల ఉన్న చిన్నపాటి ఆక్రమణలను తొలగించి పూర్తిగా భూములను స్వాధీనం చేసుకోవాలని తహసీల్దారు శ్రీనివాస్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ భ్రమరాంబ, ఆర్ఐ ముకుందహరి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశాలలో డీఎంహెచ్‌వో తనిఖీ



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, సెప్టెంబరు 6 : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందేవిధంగా చూడాలని వైద్యులకు సూచించారు. ప్రతిపల్లెకు వెళ్లి ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమాన్ని ఖచ్చితంగా నిర్వహించాలన్నారు. అవసరమైన రక్తపరీక్షలన్నీ అక్కడే చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, జ్వరాలు వచ్చిన ప్రాంతాలలో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్యులను ఆదేశించారు.

మందుల కొరత లేకుండా చూడాలి: బీజేపీ నేతల వినతి

ఆసుపత్రి తనిఖీకి వచ్చిన డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతిని బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో తరచూ మందుల కొరత ఉండడంతో పేద ప్రజలు బయటకు వెళ్లి మందులు కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మందుల కొరత రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్న దృష్ట్యా అవసరమైన మందులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బీ.వీ.రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జే.వీ.నారాయణ, బీజేపీ నాయకులు వీరచక్రం, మునగనూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్‌తో గిరిజనుల అభివృద్ధి : డీటీడబ్ల్యూవో



సమస్యలపై వినతిపత్రం స్వీకరిస్తున్న అధికారులు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 6: ప్రధాన మంత్రి జన్‌మన్‌తో గిరిజనుల అభివృద్ధి జరుగుతుందని డీటీడబ్ల్యూవో జగన్నాధరావు అన్నారు. మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని బోడేనాయక్ తాండా, బ్రహ్మంగారి దేవాలయం కాలనీ, గండి వీరయ్య చెంచుకాలనీలో పీఎం జన్‌మన్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో నాసర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్నాథరావు మాట్లాడుతూ పీఎం జన్‌మన్ ద్వారా 11 రకాల సేవలు అందనున్నట్లు తెలిపారు. అందరికీ పక్కా గృహాలు, ప్రతి ఇంటికీ నీటి కొళాయి ఏర్పాటు, అన్ని గ్రామాలకు రహదారుల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం, నాణ్యమైన విద్య వైద్యం నూపుణ్య వికాసం, పౌష్టికాహారం అందించడంతో పాటు, జీవనోపాదులు కల్పించడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ప్రస్తుతం తాము తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, గర్భిణులకు పౌష్టికాహారం అందడం లేదని వీరయ్యకాలనీ వాసులు పేర్కొన్నారు. దీంతో స్పందించిన ఎంపీడీవో నాసర్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో సాయికుమార్, టీపీ షేక్ లాలఅహ్మద్, కో-ఆర్డినేటర్ మోహన్‌రావు, కార్యదర్శి సంధ్యారాణి, ఆర్‌వోఎఫ్ఆర్ కో-ఆర్డినేటర్ మంతన్న, బాలగురవయ్య పాల్గొన్నారు.

ఓరియంట్ క్వారీలో విరిగిపడిన హైవాల్

- ఎనిమిది మంది కార్మికులు మృతి చెందారనే వదంతులు
- క్వారీని పరిశీలించిన ఎస్పీ దామోదర్

చీమకుర్తి, సెప్టెంబరు 6 : రామతీర్థం సమీపంలోని ఓరియంట్ గెలాక్సీ గ్రానైట్ క్వారీలో శుక్రవారం పెనుప్రమాదం చోటు చేసుకుంది. 2009 సంవత్సరంలో హంసా గ్రానైట్ క్వారీలో జరిగిన ఘటన మాదిరే ఇక్కడ కూడా హైవాల్ విరిగిపడింది. అయితే ఈ క్వారీలో ఉత్పత్తి లేకపోవడంతో ఎలాంటి ప్రాణప్రమాదం లేదని తెలుస్తోంది. అయితే ఘటనా స్థలంలో ఉత్పత్తికి ఉపయోగించే వాహనాలు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎనిమిది కార్మికులు హైవాల్ పడినచోట మట్టిపెళ్లలు, రాళ్ల కింద సజీవ సమాధై ఉంటారనే వార్తలు షికారుచేస్తున్నాయి. ఈ విషయాన్ని క్వారీ యాజమాన్యం అయిన కృష్ణసాయి గ్రూపు ఆఫ్ కంపెనీస్ ఖండించింది. ఈ క్వారీలో ఉత్పత్తి ప్రక్రియ నిలిచిపోయి ఏడాది దాటుతుందన్నారు. కాగా నిబంధనల విరుద్ధంగా చేస్తున్న కార్యకలాపాల వల్లే ఇటువంటి ప్రమాదాలు క్వారీల్లో జరుగుతున్నాయి. హైవాల్స్ తొలగించాల్సిన బాధ్యత క్వారీ యాజమాన్యంపై ఉంది. వాటిని తొలగించటంలో నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలకు కారణమవుతుంది. కాగా ఓరియంట్ క్వారీలో జరిగిన ప్రమాదంపై మైన్స్ డీడీని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఆ క్వారీలో ఉత్పత్తి నిలిచిపోయి ఏడాది అవుతుందన్నారు. ఎటువంటి ప్రాణప్రమాదం జరగలేదని చెప్పారు. సీఐ సుబ్బారావు స్పందిస్తూ ఈ సంఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదన్నారు.

ఎస్పీ సందర్శన

క్వారీ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందారనే వార్తలు షికార్లు చేయటంతో ఎస్పీ దామోదర్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును ఆరా తీశారు. అనంతరం చీమకుర్తి పోలీస్ స్టేషన్‌ను పరిశీలించి క్వారీల్లో ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్వారీ ఓనర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. వినాయకచవితి వేడుకలు ప్రశాంతంగా జరిగే చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ సుబ్బారావు ఉన్నారు.

అవీ..ఇవీ..

నేత్రదానంతో వెలుగులు



కరపత్రాలు ప్రదర్శిస్తున్న వైద్యులు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 6: నేత్రదానం మహాదానమని తద్వారా జీవితంలో వెలుగులు నింపవచ్చని వైద్యశాల సూపరింటెండెంట్ నాగమహేశ్వరి అన్నారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగమహేశ్వరీ మాట్లాడుతూ నేత్రదానం, కర్నియదానంతో మరొకరికి జీవితాన్ని ఇచ్చినట్లవుతుందన్నారు. ఎవరైనా నేత్రదానం చేయవచ్చన్నారు. తద్వారా ప్రమాదంలో కంటి చూపు పోగొట్టున్న వారికి తిరిగి పొందవచ్చన్నారు. మృతి చెందిన 6 గంటల్లోపు నేత్రాలను తీయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు సంజీవ్, లావణ్య, కవిత, కళాసంధ్య, హెడ్‌నర్స్ ఎలిజబెత్, ఆరోగ్యమిత్రలు చంద్రశేఖర్, మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పంటకాలువలకు మరమ్మతులు చేయాలి

బేస్తవారపేట,సెప్టెంబరు7: కంభం చెరువులో నీరు చెరడంతో రైతులు ఈ ఏడాది వరిసాగుకు సిద్ధమవుతున్నారు. అయితే వరి ఆయకట్టు బేస్తవారపేట రైతులకు పంట కాలువలు సక్రమంగా లేకపోవడం, తూములకు మరమ్మతులు చేయాలని పాలబత్తుని శ్రీనివాసులు కోరారు. కాలవల పూడికలు , చిల్లచెట్లు తొలిగిస్తే చివరి భూములకు నీరు చెరుతుందని రైతు సంబంధిత ఇరిగేష్ అధికారులను కోరారు.

నెమలిగుండ్లలో నేడు దర్శనం నిలిపివేత



రోడ్డుపై పారుతున్న గుండ్లకమ్మ నీటి వద్ద పోలీసులు

గిద్దలూరు, సెప్టెంబరు 6 : వాయుగుండం ప్రభావంతో అధిక వర్షాలు కురిసిన నేపథ్యంలో భద్రత కారణాల దృష్ట్యా శ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనాన్ని ఈనెల 7వ తేదీ శనివారం నిలిపివేస్తున్నట్లు పోలీసు, దేవాదాయశాఖ అధికారులు ప్రకటించారు. నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా గుండ్లకమ్మ నీరు దేవస్థానానికి వెళ్లే రోడ్డు పైన ప్రవహిస్తోంది. గత శనివారం అకస్మాత్తుగా రోడ్డుపైకి నీరు రావడంతో భక్తులను ఇవతలి ఒడ్డుకు చేర్చేందుకు అధికారులు వ్యయ ప్రయాసలు కోర్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్సై పి.కోటేశ్వరరావు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి బి.నరేష్, ఇతర సిబ్బంది శుక్రవారం సాయంత్రం నీటిప్రవాహం వద్దకు వెళ్లారు. రోడ్డుపై నీటిప్రవాహం తగ్గకపోవడంతో శనివారం దర్శనాలను నిలిపి వేస్తున్నట్లు ప్రకటించారు.

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు, సెప్టెంబరు 6 : పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కరాటే చాంపియన్ షిప్ పోటీలలో విజయం సాధించారు. చెన్నైలో జరిగిన మహాత్మ గాంధీ ఆల్ ఇండియా ఇన్విటేషన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో ఈపాఠశాలకు చెందిన బి.అభినయ అండర్-14 విభాగంలో కటా పోటీలలో మొదటి స్థానం, బి.భార్గవి ద్వితీయ స్థానం సాధించింది. ఇరువురిని హెచ్ఎం నాగభూషణ్‌రెడ్డి, ఫిజికల్‌డైరెక్టర్ శోభన్‌బాబు, ఉపాధ్యాయులు భారతి, సుభాన్‌ఖాన్ తదితరులు అభినందించారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనపరచి పాఠశాలకు మంచి పేరుతెచ్చారని కొనియాడారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయురాలుని సన్మానిస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు, సెప్టెంబరు 6 : రాచర్ల మండలం అనుమలపల్లి పాఠశాలకు చెందిన డి.అరుణ, ఆకవీడు ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయులు బి.రాధా కృష్ణమూర్తి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై అధికారుల చేతులమీదుగా ప్రశంస పత్రాలు పొందారు. ఇరువురిని ఆయా పాఠశాలల్లోనే శుక్రవారం స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించి తొలి స్వాతంత్ర సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, యోగా గురువు నారాయణరెడ్డి, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, సెప్టెంబరు 6: మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక పూల సుబ్బయ్య కాలనీలో శుక్రవారం కంప్యాషన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు కందుల రామిరెడ్డి, టీడీపీ నాయకులు తాండ్ర వెంకటేశ్వర్లుచౌదరి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత

గిద్దలూరు, సెప్టెంబరు 6 : మండలంలోని కే.ఎస్.పల్లిలో ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు వృద్ధురాళ్లకు దాతలు నిత్యవసర వస్తువులు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్ర కళాశాల వ్యవస్థాపకులు గురువయ్య, ఆర్ట్‌ఆఫ్ లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డి, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ హబీబ్‌ఖాన్, పలువురు దాతలు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహార పదార్థాలు అందజేత

మార్కాపురం, సెప్టెంబరు 6: వరదలతో ముంపునకు గురైన విజయవాడలోని కబేలా కాలనీలోని వారికి ఆల్ఫా గ్లోబల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆహార పదార్థాలను అందించారు. కాలనీలో తిరిగేందుకు ఒక పడవ ఏర్పాటు చేసుకుని వరదల్లో చిక్కుకున్న వారికి ఇంటింటికి తిరిగి ఆహారం ప్యాకెట్లు, మంచీనీటి బాటిళ్లు, పాలు, పెరుగు, చిన్నారులకు బిస్కెట్ అందజేశారు.

సత్రం మూసివేత

గిద్దలూరు, సెప్టెంబరు 6 : వర్షాల కారణంగా శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ సత్రాన్ని శనివారం మూసివేస్తున్నట్లు సత్రం నిర్వాహకులు గోపాల్‌రావు, చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారం సత్రం నడుపుతామని, అయితే వర్షం సందర్భంగా ఈ శనివారం సత్రాన్ని నిర్వహించడం లేదన్నారు.

జామాయిల్ కర్రను అక్రమంగా తరలించిన కేసులో 15 మందికి నోటీసులు

పామూరు, సెప్టెంబరు 6: మండలంలోని వివిధ గ్రామాల్లో అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన జామాయిల్ తోటలను కొందరు అక్రమంగా నరికి తరలిస్తున్న కేసులో సుమారు 15 మందికి 41 నోటీసులు జారీ చేసినట్లు సీఐ ఎం.భీమానాయక్ తెలిపారు. మండంలోని గుమ్మలంపాడు, కంభాల దిన్నె, పడమటకట్ట కిందపల్లి, దూబగుంట ప్రాంతాల్లో అగ్రిగోల్డ్ సంస్థకు వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. వీటిల్లో జామాయిల్ తోటలు ఉన్నాయి. అగ్రిగోల్డ్‌పై కోర్టు వ్యవహారాలు ఉండటంతో సీబీఐ అటాచ్‌మెంట్‌లో భూములు ఉన్నాయి. ఈ భూముల్లోని జామాయిల్ కర్రను కొందరు రాత్రుళ్లు అక్రమంగా నరికి లారీల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రెండు రోజుల క్రితం వగ్గంపల్లి వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు సీఐ భీమానాయక్ తన సిబ్బందితో మాటువేసి అగ్రిగోల్డ్ తోటల నుంచి అక్రమంగా తరలిస్తున్న జామాయిల్ కర్రను స్వాధీనం చేసుకొన్నారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదుచేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పామూరు రెవెన్యూ కార్యాలయ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. సీఐ భీమానాయక్ కేసు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం 15 మందిని గుర్తించి 41 నోటీసులు జారీ చేశారు. ఇంకొ మరికొంత మంది ఉన్నట్టు గుర్తించినట్లు సీఐ తెలిపారు.

వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు



నర్సింహారావు దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీవో వసంతరావునాయక్

దొనకొండ, సెప్టెంబరు 6: వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో వసంతరావునాయక్ అన్నారు. జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడు అవార్డు పొందిన నర్సింహారావుకు దొనకొండ జడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు అధ్యక్షతన శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ దొనకొండ జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేలా చేసిన కృషిని గుర్తించి ఫిజికల్ డైరెక్టర్ నర్సింహారావుకు జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు లభించిందని చెప్పారు. అవార్డు గ్రహీత నర్సింహారావు దంపతులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, పలువురు గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

దర్శి, సెప్టెంబరు 6: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సందర్భంగా గురువారం రాత్రి పట్టణంలోని సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. స్థానిక పొట్టి శ్రీరాములు కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రఘురామయ్య, రమాదేవి, డాక్టర్ పెద్దిరాజు, తదితరులను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు నారపుశెట్టి మధు, స్వాములు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి చేయూత

దర్శి, సెప్టెంబరు 6: దర్శి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సేవలు అందించేందుకు వీలుగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సీటీజీ యంత్రాన్ని శుక్రవారం కొనుగోలు చేశారు. కొద్దిరోజులక్రితం ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె సందర్శించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు ఆసుపత్రికి కావల్సిన పరికరాలను అందజేయాని కోరారు. వారి సూచన మేరకు సీటీజీ యంత్రాన్ని కొనుగోలుజేసినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. త్వరలో ఆ యంత్రాన్ని ఆసుపత్రికి అందజేస్తామని ఆమె తెలిపారు.

ఇంటర్ విద్యార్థుల కోసం స్టడీ అవర్స్

పామూరు, సెప్టెంబరు 6: ఇంటర్ విద్యార్థుల కోసం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.రాజశేఖర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఉదయం పూట స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. దీని వల్ల వెనుకపడిన విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. తద్వార పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని రాజశేఖర్ పేర్కొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 6: సీఎస్‌పురం మండలం డీజీపేట గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న నలుగురిని ఎస్ఐ బి.ప్రేమ్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,523 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైన పేకాట ఆడుతుంటే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు, సెప్టెంబరు 6: మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ గంగపాలెం గ్రామంలో వాగుపోరం బోకు భూమిలో ఏర్పాటుచేసిన బోర్డులను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పి.సింగారావు శుక్రవారం స్థానిక ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబరు 682లోని 3.50 సెంట్ల విస్తీర్ణంలోని వాగు పోరంబోకు భూమిలో కొంతభాగాన్ని ఆక్రమించారు. గ్రామస్థులు ఫిర్యాదు చేయటంతో రెవెన్యూ అధికారులు ఆ భూమిని పరిశీలించి ఆక్రమించినట్లు నిర్ధారించారు. ఆ భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని రెవెన్యూ అధికారులు నిషేధిత బోర్డులు ఏర్పాటుచేశారు. ఆ బోర్డులను ఆక్రమణదారులు తొలగించి వాగు పోరంబోకు భూమిని ఆక్రమించారని వీఆర్వో ఎం.రమణారెడ్డి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో తహసీల్దార్ పి.సింగారావు వాగుపోరంబోకు భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు.

మైనర్ బాలికను వేధిస్తున్న ఆకతాయిపై కేసు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 6: మైనర్ బాలికను వేధిస్తున్న ఆకతాయిపై ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. రెండేళ్ల క్రితం బాలిక పదో తరగతి చదువుతున్న సమయంలో ఒంగోలు నగరం వడ్డివానికుంటకు చెందిన పెద్రా బాబు పరిచయమయ్యాడు. అతడిపై తాలుకా పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీటు ఉండటం, అతని ప్రవర్తనపై అనుమానింతో సదరు బాలిక మాట్లాడటం మానేసింది. అయితే అప్పటి నుంచి బాలిక వెంటపడుతున్న బాబు తనతో ఫోన్ మాట్లాడాలంటూ వత్తిడి తెస్తున్నాడు. లేకుంటే తనను, తల్లిదండ్రులను చంపుతానని బెదిరిస్తున్నాడు. అంతేగాకుండా ఇంటికి వచ్చి గొడవ చేస్తానని వేధిస్తున్నాడు. అయితే బాలిక కాలేజీలో చదువుతూ ఇతర ప్రాంతంలో ఉంటుంది. గత నెలలో సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చింది. ఈనెల 4న బాలిక వెంట పడిన బాబు చంపేస్తానని బెదిరించాడు. ఈమేరకు బాలిక తల్లిదండ్రులు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశుభ్రతపై అవగాహన పెంచండి

పంగులూరు, సెప్టెంబరు 6 : ప్రజలకు వ్యాధులు దరి చేరకుండా ఉండేందుకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలలో అవగాహన పెంపొందించాలని పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ సంతాన సేన్ సూచించారు. శుక్రవారం పంగులూరు - 2 విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సెంట్రల్ టీమ్ ప్రతినిధులు సందర్శించారు. క్లినిక్‌లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నేషనల్ మానిటర్ ఎడ్వినా పెరయిరా, జిల్లా క్వాలిటీ మేనేజర్ ధనరాజు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మండపాలకు తరలిన గణనాథులు

- వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు
- మట్టి గణపతి విగ్రహాలపైనా ఆసక్తి
- బోయపాలెంలో భారీ విగ్రహం ఏర్పాటు



కనిగిరి నుంచి గ్రామాలకు తరలివెళుతున్న వినాయక విగ్రహాలు

కనిగిరి, సెప్టెంబరు 6: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన మండపాలకు గణనాథులను తరలించారు. శనివారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఈసందర్భంగా శుక్రవారం కనిగిరిలో సందడి వాతావరణం నెలకొంది. పూజాసామగ్రి కొనుగోలుతో దుకాణాల వద్ద రద్దీ నెలకొంది.

నగరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద, పార్కు వద్ద ఉన్న వినాయక విగ్రహాలను ముందుగానే కొనుగోలు చేసుకున్నారు. వాటిని శుక్రవారం ఉత్సవ నిర్వాహకులు ప్రత్యేక వాహనాల్లో గ్రామాలకు తరలించుకుపోయారు. గతేడాది కంటే ఈ ఏడాది విగ్రహాల కొనుగోళ్ళు తగ్గాయని విక్రయదారులు చెప్తున్నారు. ఈఏడాది పోలీసుశాఖ విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా అనుమతి ఇచ్చింది. కనిగిరి సర్కిల్ పరిధిలోని కనిగిరి, పీసీపల్లి, హెచ్‌ఎంపాడు, వెలిగండ్ల మండలాల్లో 109 విగ్రహాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు ఇచ్చినట్లు సీఐ ఖాజావలి తెలిపారు. కనిగిరి మండలంలో 50 విగ్రహాలకు అనుమతులు పొందినట్లు తెలిపారు. గతేడాది కనిగిరి మండలంలోనే 250 పైగా విగ్రహాలను ఏర్పాటుచేశారు. గతేడాది కంటే ఈసంవత్సరం తగ్గాయని తెలుస్తుంది. కనిగిరి పట్టణంలోని బోయపాలెంలో ప్రతిఏటా గణేష్ విగ్రహాన్ని అన్నింటికంటే విభిన్నంగా, పెద్దదిగా ఏర్పాటుచేయడంతోపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈఏడాది కూడా 22 అడుగుల గణేష్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తున్నారు.

ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి

పామూరు, సెప్టెంబరు 6: పామూరు పట్టణంలో పలు ప్రాంతాల్లో గణేష్ ఉత్సవ కమిటీలు ఏర్పాటుచేయనున్న మండపాల ప్రదేశాలను సీఐ ఎం.భీమా నాయక్ శుక్రవారం పరిశీలించారు. వాసవీ కన్యాకపరమేశ్వరి, ఆకులవీధి తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేయనున్న వినాయక మండపాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అలాగే, ఐదోరోజు నిమజ్జనానికి బయలుదేరే గణనాథుల విగ్రహాల రూట్ మ్యాప్, రోడ్లను పరిశీలించారు. అనంతరం స్థానిక సర్కిల్ కార్యాలయంలో గోల్డ్‌షాపు అసోసియేషన్ సభ్యులతో జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడారు. బంగారు వర్తకులు తమ షాపుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. షాపుల ముందు వాహనాలు పార్కింగ్‌చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు గోస్టు రామారావు, సాయికిరణ్, పాబోలు రమేష్, బి.వినోద్‌బ్రహ్మం, ఎన్.నాగేంద్రచారి, ఎం.మణిభూషణచారి, నటుకుల సుబ్బారావు, రమేష్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.



పామూరు:వినాయక మండపాల ప్రదేశాలను పరిశీలిస్తున్న సీఐ భీమానాయక్

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాల ఏర్పాటు



దర్శి: లయన్స్ క్లబ్ స్నేహ ఆధ్వర్యంలో పంపిణీ కోసం సిద్ధం చేసిన మట్టి గణేష్ విగ్రహాలు

దర్శి, సెప్టెంబరు 6: వినాయక చవితి సందర్భంగా ప్రజలు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని గణేష్ మట్టి విగ్రహాలపై దృష్టి సారించారు. స్థానిక లయన్స్‌క్లబ్ స్నేహ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులతో మట్టి విగ్రహాలు తయారుచేయించారు. మండలంలో ఈ ఏడాది గణేష్ ఉత్సవాలను వైభవంగా జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. పుష్కలంగా వర్షాలు కురవటంతో పాటు సాగర్ జలాశయాలు నిండటంతో పంటలు కళకళలాడుతున్నాయి. రైతులు ఉత్సవాలను భారీగా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా దర్శి ప్రాంతంలో 60 విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే అనుమతులు తీసుకున్నారు. పండగరోజు విగ్రహాలు నెలకొల్పిన తర్వాత ఐదు రోజులు, తొమ్మిది రోజులు ఉత్సవాలు చేసి నిమజ్జనం చేస్తారు. అన్నివర్గాల ప్రజలు వినాయక చవితి వేడుకలను జరుపుకునేందుకు సన్నద్ధమవుతు న్నారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

సీఎస్‌పురం(పామూరు) సెప్టెంబరు 6: మండలంలోని అనకాలపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భారతి మట్టి వినాయక ప్రతిమలు తయారుచేసి స్థానికులకు ఉచితంగా అందజేశారు. మట్టితో తయారుచేసిన బొమ్మలతో పర్యావరణానికి ఎటువంటి హాని కలగదని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విగ్రహాల ఏర్పాట్లు

ముండ్లమూరు: మండలంలోని వినాయక చవితి పండుగను పురస్కరించుకొని భక్తులు ఆయా గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటుచేసేందుకు మండపాలు ఏర్పాటు చేశారు. విగ్రహాలు ఏర్పాటుచేసే నిర్వాహకులు అద్దంకి, దర్శి, ఒంగోలు, వినుకొండ ప్రాంతాలకు వెళ్ళి విగ్రహాలను తీసుకువచ్చి ఊరేగింపుగా గ్రామాలకు తీసుకువచ్చారు. మండలంలో వంద విగ్రహాల వరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ ఖాజావలి

కనిగిరి, సెప్టెంబరు 6: లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐ ఖాజావలి అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయాధికారి కె.భరత్‌చంద్ర నేతృత్వంలో ఈనెల 14న లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివాదాలు, ఇతర కారణాలతో కోర్టుల్లో కేసులు వేసుకుని విలువైన సమయంతో పాటు ప్రశాంతమైన జీవితాన్ని దూరం చేసుకుంటున్నారన్నారు. వివిధ కేసుల్లో ఎన్నో ఏళ్ళుగా ఉన్నవాటిని కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకుని ప్రశాంతమైన జీవితం గడిపేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. కోర్టుల్లో కేసులు రాజీ చేసుకునే వారు తమ ఆధార్‌కార్డులతో పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

కార్యక్రమంలో ఎస్ఐ త్యాగరాజు, గుడ్ హెల్ప్ రమేష్, శ్యామ్యూల్, నవకుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లోనే పోషకాహారం లభ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి

కనిగిరి, సెప్టెంబరు 6: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పోషకాహారం లభ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి అన్నారు. పోషకాహర మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని గురవాజీపేట సెక్టార్ పరిధిలోని బల్లిపల్లి గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బల్లిపల్లి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహర పదార్థాల లోగోలను ప్రదర్శించి బాలింతలు, గర్భిణులకు వివరించారు. ప్రభుత్వం సరఫరాచేసే బియ్యం, రాగిపిండి, బాలామృతం, పాలు, గుడ్లు, చిక్కీలు, బెల్లం, ఎండు ఖర్జూరాలను సక్రమంగా తీసుకోవాలన్నారు. తద్వార పిల్లలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా ఉంటారని చెప్పారు. వీటితోపాటు చౌకగా లభించే తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, మొలకెత్తిన విత్తనాలు తీసుకోవటంవల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రీ స్కూల్ పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను ఆటపాటలతో బోధిస్తున్నట్టు చెప్పారు. కేంద్రం పరిధిలోని చిన్నారులు వారి తల్లిదండ్రులు స్కూలుకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.ప్రసాద్, ఎమ్మెస్కేలు వైదేహి, శివకుమారి, కార్యకర్తలు షర్మిల, అరుణ, సలోమి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కనిగిరి: బల్లిపల్లి కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి

చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం ఇవ్వాలి

దొనకొండ, సెప్టెంబరు 6: చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ సూచించారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు పలురకాల పిండివంటలు, తినుబండారాలను తయారుచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారులకు తప్పనిసరిగా బలవర్ధకమైన పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య పరిరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, ప్రతిభ, బీబీజాన్, సరళ, ఏఎన్ఎం రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని అందించాలి

తాళ్లూరు, సెప్టెంబరు 6: పిల్లలతో పాటు, గర్భిణులు, బాలింతలకు మంచి ఆరోగ్యాన్ని ఇచ్చే పౌష్టికాహారాన్ని అందించడంలో శ్రద్ధ చూపాలని సీడీపీవో సీహెచ్ భారతి అన్నారు. పౌష్టికాహర వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తాళ్లూరు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సంప్రదాయ వంటకాల వల్ల ఊబకాయంతగ్గి ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం



రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న ఏవో ప్రసాదరావు

తాళ్లూరు, సెప్టెంబరు 6: ప్రకృతి వ్యవసాయ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తూర్పుగంగవరం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం సాగుచేసే రైతులకు ప్రోత్సాహక పరికరాలు అందజేశారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగుచేస్తున్న సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహించేందుకు వనరులను సమకూరుస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ రైతులు, మహిళా రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పట్టలను రాయితీపై అందజేస్తున్నట్టు చెప్పారు.

నాగంబొట్లపాలెం యూనిట్ పరిధిలో 370 మంది రైతులు 425 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్నారని చెప్పారు. రైతులకు పట్టలు, డ్రమ్ములు పలురకాల పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యత్తపు కాశిరెడ్డి, టీడీపీ నాయకులు గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి(చందన), చాట్ల ఇమ్మానియేల్, వీఏఏ సుమ, ప్రకృతి సాగు ఇన్‌చార్జ్ పి.నరసింహలు, ఐసీఆర్‌పీలు మౌనిక, పల్లవి, కోట రత్తమ్మ, వాణి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

దొనకొండ, సెప్టెంబరు 6: విజయవాడలో వరద ముంపునకు గురైనవారిని ఆదుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించి విరాళాల సేకరణకు శ్రీకారం పలికారు. ఈసందర్భంగా శివకోటేశ్వరరావు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు సేకరించి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ద్వారా సీఎం సహాయనిధికి పంపేందుకు ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి విరాళాలు అందించాలని కోరారు. అనంతరం దొనకొండ పురవీధుల్లోని దుకాణాలు, ప్రజల వద్ద విరాళాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మోడి వెంకటేశ్వర్లు, కొత్తం రఘునాథరెడ్డి, యరగొర్ల బసవయ్య పత్తి వెంకటేశ్వర్లు, యగ్గేని యల్లారెడ్డి, మన్నెం గాలెయ్య, కొమ్మతోటి సుబ్బారావు, షేక్ తోహీద్, తదితరులు పాల్గొన్నారు.



దొనకొండలో విరాళాలు సేకరిస్తున్న టీడీపీ నాయకులు

పామూరులో విరాళాల సేకరణ

పామూరు, సెప్టెంబరు 6: వరదతో విజయవాడలో నిరాశ్రయులైన వారి సహాయార్థం కోసం శ్రీఆదిత్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం పామూరు పట్టణంలో విరాళాలు సేకరించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు ఆదేశాల మేరకు అధ్యాపకులు, విద్యార్థులు విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, సెప్టెంబరు 6: మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి విజయవాడలోని వరద బాధితులను ఆదుకొనేందుకు రూ.11,500 శుక్రవారం వసూలుచేశారు. ఈ నగదును జిల్లా కలెక్టర్‌కు డీడీ తీసి పంపుతున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. వరద బాధితులను ఆదుకొనేందుకు విద్యార్థులు స్వచ్ఛందంగా నిధులు వసూలు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ నాగేశ్వరరావు, కె.విజయ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, సెప్టెంబరు 6: మండలంలోని తూర్పుగంగవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గుట్లపల్లి హనుమంతరావు విజయవాడ వరద బాధితులకు రూ.ఐదు వేలు రాష్ట్ర వరద సహాయ నిధికి శుక్రవారం అందజేశారు. ఈ నగదును వరద సహాయనిధికి ఫోన్‌పే ద్వారా పంపారు.





విఘ్ననాథా.. నమోస్తుతే

- జిల్లాకు వినాయక ఉత్సవ శోభ
- వర్షాన్ని లెక్కచేయకుండా ఏర్పాట్లు
- వాడవాడలా వెలిసిన గణనాథుల పందిళ్లు
- విగ్రహాలు, పత్రి విక్రయాలతో కూడళ్లు సందడి
- సత్తెనపల్లిలో 61 అడుగుల మట్టి మహా గణపతి


పూజా సామగ్రి కొంటున్న మహిళలు

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్షాలు వీడటంలేదు. కొన్ని ప్రాంతాల్లో వరదలు ముంచెత్తాయి. వినాయక చవితి సమీపించేంది. ఈ సారి విఘ్ననాయకుడి చవితికి వాన గండం తప్పదని భావించారు. కానీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడ చూసినా సందడే.. సందడి. వర్షాలు.. వరదలను ఏ మాత్రం లెక్క చేయకుండా జిల్లావ్యాప్తంగా ఘనంగా వినాయక చవితి పర్వదినం జరుపుకునేందుకు భారీగా ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా అంతటా గణపతి ఉత్సవ శోభ సంతరించుకుంది. పల్లెలు, పట్టణాలలో వినాయక చవితి కోలాహలం నెలకొంది. గ్రామాలు, మున్సిపల్ పట్టణాల నుంచి జిల్లా కేంద్రాలైన గుంటూరు, నరసరావుపేట, బాపట్ల వరకు వాడవాడలా చవితి పందిళ్లు వెలిశాయి. చిన్నారులు నుంచి వృద్ధుల వరకు ఉత్సవాలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సీనీ సెట్టింగ్ తరహాలో పందిళ్లను అందంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా పందిళ్లను శోభాయమానంగా అలంకరించారు. రంగురంగుల వస్త్రాలు, పూలు తదితరాలతో సుందరంగా అలంకరించారు. వినాయక మండపాలు విద్యుత్ కాంతులీనుతున్నాయి. విగ్రహ వేదికలను, మార్గాలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. కొన్ని దగ్గర్ల శుక్రవారం మధ్యాహ్నానికే భారీ విగ్రహాలను కూడా కొలువుదీర్చారు. సత్తెనపల్లి పట్టణంలోని నాగార్జుననగర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పర్యావరణ హితం, సామాజిక అభిమతం, మట్టి వినాయకుడిని పూజిద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో 61 అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బంక మట్టి, కొబ్బరి పీచు తదితరాలతో పర్యావరణానికి ముప్పు లేకుండా ఈ విగ్రహాన్ని తయారు చేశారు. ఈ విగ్రహం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. చిలకలూరిపేట షరాఫ్‌బజార్ గణేష్ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్షల బంగారు కోటింగ్ గవ్వలతో వినాయక విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేశారు. బంగారు గవ్వల గణపయ్య విగ్రహాన్ని తంజావూరు, కలకత్తా కళాకారులు రూపొందించారు. గుంటూరు అరండల్‌పేట 11/1వ లైనులోని శ్రీ రమా సహిత సత్యన్నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో 40వ(చత్వారింశ) గణేష్ నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెనాలిలోని విజయవాడ రోడ్డులో 60 అడుగుల భారీ గణపతి విగ్రహానికి ముచ్చట గొలిపే విధంగా రంగులతో తీర్చిదిద్దారు. ప్రతి వీధిలోనూ భక్తులు గణనాథుడ్ని కొలిచేందుకు సిద్ధం చేశారు. నరసరావుపేటలో వందల సంఖ్యలో భారీ విగ్రహాలను విక్రయించినట్లు తయారీదారులు తెలిపారు. తయారీదారుల నుంచి విగ్రహాలను ఊరేగింపుగా నిర్వాహకులు మండపాలకు తరలించారు. శనివారం గణపతి పూజలకు పందిళ్ల వద్ద ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం సాయంత్రం భక్తులు గణపతి విగ్రహాలను దర్శించుకునేందుకు వీలుగా కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నది. శుక్రవారం కూడా పలు ప్రాంతాల్లో వర్షాలు పడగా తెరిపిచ్చిన సమయాన్ని నిర్వాహకులు వేడుకల కోసం కేటాయిస్తున్నారు. దీంతో జిల్లాలో శుక్రవారం ఎక్కడ చూసినా ఒకటే హడావుడి.. భక్తుల సందడి నెలకొంది. ఇక పలు ప్రాంతాల్లో మట్టిగణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదాలతో కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులతో మట్టి ప్రతిమల తయారీ పోటీలు, ర్యాలీలు కార్యక్రమాలు జరిగాయి. వివిధ శాఖలు, సంస్థల ఆధ్వర్యంలో మట్టి గణపతుల విగ్రహాల పంపిణీలు విస్తృతంగా జరిగాయి. పందిళ్ల వద్ద వినాయక ఆలయాల్లో కూడా విఘ్నేశ్వర పూజలకు అర్చకులు ఏర్పాట్లు చేశారు.


సత్తెనపల్లి : నాగార్జుననగర్‌లో 61 అడుగుల మట్టి వినాయకుడు



ప్రధాన రహదారులన్నీ కిటకిట

జిల్లాలోని ప్రధాన రహదారులన్నీ శుక్రవారం వినాయక విగ్రహాలు, పత్రి విక్రయ దుకాణాలు వెలిశాయి. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ రోడ్లపై ప్రతిమలు తయారు చేసే వారు, పూజాసామగ్రి, పత్రి, మామిడి ఆకుల విక్రయాలను చేపట్టేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. మధ్యాహ్నం వర్షం పడగా సాయంత్రానికి తగ్గడంతో ప్రజలంతా ఒక్కసారిగా రోడ్ల మీదకు రావడంతో చాలా చోట్ల మార్కెట్లు కిక్కిరిసి పోయాయి.




పత్రి కొనుగోలు చేస్తున్న మహిళలు


అద్దంకిలో నిర్వహించిన మహిళా మార్ట్ (ఫైల్)

విచారణ అటకెక్కినట్లేనా?

- జగనన్న మహిళా మార్ట్‌లో నిధులు గోల్‌మాల్
- పెట్టుబడి నిధుల కోసం సభ్యుల ఎదురుచూపులు
- మూతపడి మూడు నెలలైనా పంపిణీ చేయని నగదు
- అధికారుల బదిలీతో ఇక అంతే సంగతులనే అనుమానాలు

అద్దంకి, సెప్టెంబరు 6: జగనన్న మహిళా మార్ట్‌లో నిధులు గోల్‌మాల్ విచారణ అటకెక్కినట్టేనన్న అనుమానాలు మెప్మా సభ్యుల్లో నెలకున్నాయి. రెండున్నరేళ్ల క్రితం వైసీపీ హయాంలో అద్దంకిలో మెప్మా ఆధ్వర్యంలో జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు పెట్టుబడి సొమ్ము కోసం అద్దంకిలోని 8 వేల మంది సభ్యుల నుంచి రూ.11 లక్షలను వసూలు చేశారు. ఏటా వచ్చే ఆదాయాన్ని సభ్యులకు పంచేలా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. అన్న క్యాంటీన్ తొలగించి ఆ భవనంలో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. అయితే మొదట చెప్పినట్లుగా ఇప్పటి వరకు సభ్యులకు ఎలాంటి లాభాలను పంపిణీ చేయలేదు. మహిళా మార్ట్ నిధులు పక్కదారి పట్టించారన్న విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మార్ట్ స్థానంలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. అందులో ఉన్న ఫర్నిచర్‌ను మెప్మా కార్యాలయానికి తరలించారు. మార్ట్ మూసివేసే సమయానికి బ్యాంక్ ఖాతాలో నగదు నిల్వలు పెద్దగా లేవు. మార్ట్‌లో సరుకులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. సభ్యుల ఫిర్యాదుతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ విచారణకు ఆదేశించారు. అయితే తొలుత హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత దీని గురించి పట్టించుకోకుండా వదిలివేశారన్న అనుమానాలు సభ్యుల్లో నెలకొంది. సభ్యుల ఆందోళనతో విడతలుగా బ్యాంక్ ఖాతాలో సుమారు రూ.5 లక్షల జమ చేసినట్లు తెలుస్తుంది. కొంత మొత్తాన్ని ఫర్నిచర్ కొనుగోలకు వెచ్చించినా వచ్చిన లాభాల పరిస్థితి ఏమిటని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. మహిళా మార్ట్ నిధులు గోల్‌మాల్‌తో సంబంధం ఉన్న అధికారులు, సిబ్బంది బదిలీ పేరుతో జారుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల బదిలీలు కూడా జరుగుతుండడంతో విచారణ ఇక అటకెక్కుతుందేమోనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మహిళా మార్ట్ నిధులు గోల్ మాల్ విచారణను వేగవంతం చేయించాలని సభ్యులు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు

అద్దంకి, సెప్టెంబరు 6: అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను త్వరలో ఏర్పాటు చేస్తామని విద్యుత్‌శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో భాగంగా మొదటగా అద్దంకిలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఈ శివప్రసాద్ పాల్గొన్నారు.




పెనుమూడి పల్లెపాలెంలో అధికారుల కోసం ఎదురుచూస్తున్న బాధితులు

తేరుకున్నా.. కన్నీళ్లే

- కుళ్లిన పైర్లు.. ఆందోళనలో రైతులు
- సాయం కోసం బాధితుల ఎదురు చూపులు
- ముంపు గ్రామాలను ఆదుకోవడంపై క్షేత్రస్థాయి సర్వే
- లంకల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక అధికారి నియామకం



కృష్ణమ్మ మహోగ్రరూపానికి వారం రోజులు చిగురుటాకులా వణికిన నదీపరివాహక గ్రామా లు, లంకలు ఇప్పుడిప్పుడే తేరు కుంటున్నాయి. వరదకు విరామం.. వరుణుడు విశ్రాంతి తీసుకున్నా.. విపత్తు పరిణామాలు వెలుగు చూస్తున్నాయి. ఆరురోజుల క్రితం 11 లక్షల క్యూసెక్కుల మేర వరద ఉధృతి క్రమేపి తగ్గు తూ వస్తోంది. వరద ముప్పు తొలగి ప్రభావిత లంక గ్రామాలు తేరుకుం టున్నా బాధితులు కన్నీటి సంద్రంలో చిక్కుకున్నారు. విపత్తు నుంచి ఇప్పుడిప్పుడే కోలుకునే పరిస్థితులు కనిపించడం లేదని బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇళ్లు కోల్పోయి, ఆస్తులు నష్టపోయి, పంటలు నీటిపాలైన వారు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు వరద నష్టాల పై ప్రభుత్వ యంత్రాంగం శాఖల వారీగా చేపట్టిన సర్వే శుక్రవారం కొనసాగింది.

రేపల్లె, బాపట్ల, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): వరద గండం గట్టెక్కింది ప్రజలు మాత్రం కష్టాల సుడిగుండంలో అల్లాడుతున్నారు. ఈ కష్టాల నుంచి బయటపడే పరిస్థితి కనిపించడం లేదని బాధితులు ఆవేదన చెం దుతున్నారు. అన్నదాతలను వరద నిండా ముంచేసింది. ఇళ్లన్నీ రోజుల తరబడి నీళ్లల్లోనే ఉండడంతో విలువైన సామాన్లతో పాటు అన్నీ తడిసి పనికిరాని స్థితికి చేరుకున్నాయి. నదీ తీర గ్రామాలు, లంకల్లో ఎటు చూసినా వరద మిగిల్చిన విషాదమే. వర్షపునీరు బయటకు పోవటంతో బయటపడిన పైర్లు పరిశీలిస్తే కొన్నిచోట్ల 90 శాతానికి పైగా కుళ్లిపోగా మరికొన్నిచోట్ల 50 శాతం పైర్లు పనికిరాకుండా పోయాయి. పైర్లు పరిశీలించిన రైతులు కన్నీరుపెట్టుకుంటున్నారు. మరలా నారుపోసి పెంచి నాటువేయాలంటే పెట్టుబడి భారం మరింత పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి కష్టనష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి అయితే మరింత దయనీయంగా మారింది. అప్పులు చేసి ముందుగానే కౌలు చెల్లించి ఇంజన్‌తో నీరుపెట్టి నాటు వేసి కొందరు, వెదపెట్టి మరికొందరు రైతులు ఇప్పుడు పూర్తిగా నష్టపోయారు. ముంపునకు గురై సర్వం కోల్పోయిన కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని 22 లంక గ్రామాల ప్రజలు ప్రభుత్వం అం దించే సాయం కోసం ఎదురుచూస్తున్నారు. పసుపు, కంద పైర్లు ఒండ్రు మట్టితో నిండిపోయాయి. బొప్పాయి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కూరగాయ తోటలు పూర్తిగా కుళ్లిపోయి పనికి రాకుండా పోయాయి. పారిశుధ్య కార్యక్రమాల పనులు వేగవంతంగా సాగుతుం డగా, ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసరాల కిట్ల పంపిణీ సరఫరా 85 శాతం పూర్తి కావచ్చినట్లు అధికారులు తెలిపారు.


పల్లెపాలెంలో బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

గృహాలకు జరి గిన నష్టంపై శరవేగంగా నివేదికలు రూపొం దిస్తున్నారు. మరోవైపు ఛిద్రమైన రహదా రులను త్వరగా బాగు చేసేందుకు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలు కసరత్తు చేస్తున్నాయి. గ్రామాలు విడిచి పునరావాస కేంద్రాలకు వెళ్లి తిరిగి వచ్చిన వారు ఇళ్లు, పరిసరాలను బాగు చేసుకునే పనిలో ఉన్నారు. బ్యాంక్ పాస్ బుక్, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్‌లు ఇలా ఎన్నో విలువైన పత్రాలు నీటపాలయ్యాయని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలేవీ పని చేసే స్థితిలో లేవని వాపోతున్నారు. 23 ముంపు గ్రామాలకు సంబంధించి 7,861 కుటుంబాలకు నిత్యావ సరాల కిట్లను శుక్రవారానికి 85 శాతం పంపిణీ చేసినట్లు కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. పశువుల ఆకలిని తీర్చేందుకు 95 మెట్రిక్ టన్నుల దాణా పంపిణీ చేపట్టారు. వీటితో పాటు పశువులకు టీకాలను కూడా వేస్తున్నారు. 151 బృందాలు శాస్త్రీయంగా పంటలకు జరిగిన నష్టాన్ని లెక్కిస్తున్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం దాదాపుగా 92,000 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కొల్లూరు, రేపల్లె, భట్టిప్రోలు మండలాల్లో ఉద్యాన పంటలను ఇతర మండలాల నుంచి వచ్చిన అధికారులు ప్రత్యేకంగా సర్వే చేస్తున్నారు. కొల్లూరులోనే మకాం వేసిన కలెక్టర్ శుక్రవారం కూడా ఆయా గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వరదల ధాటికి సర్వస్వం కోల్పోయామని బాధితులు కలెక్టర్ ముందు ఆవేదన వెలిబుచ్చారు. నష్టపోయిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ వారికి ధైర్యం చెప్పారు.

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

- దారి మళ్లింపులతో గంటల కొద్దీ ఆలస్యం
- మూడు చోట్ల క్రూ మార్పుతో ప్రత్యక్ష నరకం

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ఆగాయి.. అయినా ఇంకా రైళ్ల రాకపోకలు కొలిక్కిరాలేదు. కొన్ని రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నారు. దీంతో పలు రైళ్లు గంటలకొద్దీ ఆలస్యంగా నడు స్తుండటంతో ప్రయాణికులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. కేవలం గూడ్స్ రైళ్లను మాత్రమే ఇప్పటి వరకు నడుపుతున్న ఈ రూట్‌లో గత వారం నుంచి విజయవాడ వైపునకు వెళ్లాల్సిన రైళ్లను దారి మళ్లించి తీసుకొస్తున్నారు. దీంతో సాంకేతికంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రాయనపాడు వద్ద వరదనీరు పట్టాల పైకి చేరుకుంటున్నదని ఈ ప్రత్యామ్నాయాన్ని రైల్వే శాఖ చేస్తున్నది. అయితే ఇది ప్రయాణికులను తీవ్ర అసౌకర్యానికి గురి చేయడమే కాకుండా 12 గంటలకు పైగా ఆలస్యంగా గమ్యస్థానాలకు రైళ్లను నడపాల్సిన పరిస్థితి తలెత్తుతున్నది. దాంతో రేక్ షేరింగ్ ఉన్న రైళ్లను రీషెడ్యూల్ చేయాల్సి వస్తున్నది. గురువారం అర్ధరాత్రి దాటాక హఠాత్తుగా సికింద్రాబాద్ నుంచి కాజీపేట మీదగా విజయవాడ వైపునకు వెళ్లాల్సిన రైళ్లను జగ్గయ్యపేట వద్ద నుంచి మోటుమర్రి, విష్ణుపురం, గుంటూరు మీదగా దారి మళ్లిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. అప్పటి వరకు రైలుని నడిపిన క్రూ(లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్, గార్డు) అక్కడ దిగిపోవాలి. అనంతరం మోటుమర్రి సెక్షన్‌లో గూడ్స్ రైళ్లను నడిపే క్రూతో విష్ణుపురం తీసుకురావాలి. ఆ తర్వాత విష్ణుపురం నుంచి విజయవాడ వరకు మరో క్రూని సమకూర్చాలి. విష్ణుపురం వద్ద గుంటూరు డివిజన్‌కు చెందిన క్రూ అందుబాటులో ఉండరు. నల్లపాడులో ఉన్న సిబ్బందిని అక్కడికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. అలానే విష్ణుపురంలో ఎలాంటి క్యాటరింగ్ సదుపాయాలు కూడా ఉండవు. దీంతో గంటల తరబడి గోదావరి, మహబూబ్ నగర్ - వైజాగ్, నాగర్‌సోల్ - నరసపూర్, గౌతమి, బీదర్ ఎక్స్‌ప్రెస్‌లను నిలిపేయాల్సి వచ్చింది. కాగా రైళ్లకు వాటరింగ్ నింపే సౌకర్యం గుంటూరు, విజయవాడల్లో మాత్రమే ఉన్నది. పైన పేర్కొన్న రైళ్లలో నీళ్లు అయిపోవడంతో ప్రయాణికులు టాయ్‌లెట్స్‌కు వెళ్లలేక నరకయాతన పడ్డారు. దాంతో విష్ణుపురం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఉదయం ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు అడ్డంగా నిలిచి కాసేపు రైల్‌రోకో కూడా చేశారు. అయినా ఎలాంటి ఫలితం లేకపోయింది. విష్ణుపురం - గుంటూరు సింగిల్ లేన్ రైలు మార్గం. ఈ రూట్‌లో ఇంటర్‌సిటీ, పల్నాడు, ఫలక్‌నుమా, వందేభారత్, జన్మభూమి, రేపల్లె ఎక్స్‌ప్రెస్ వంటివి ప్రయాణిస్తాయి. వీటి సమయపాలన దెబ్బతినకుండా చూసుకుంటూ దారి మళ్లించిన వాటిని విజయవాడకు తీసుకెళ్లడం చాలా కష్టం. ఈ కారణంగానే పైన పేర్కొన్న రైళ్లన్నీ 12 గంటల ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరుకున్నాయి. దాంతో నరసపూర్ ఎక్స్‌ప్రెస్‌ని నాలుగు గంటల పాటు రీషెడ్యూల్ చేయాల్సి వచ్చింది.





సాగునీటి కాలువలను పరిశీలిస్తున్న శాసనసభ్యులు

పంటకాలువ లాకుల పరిశీలన

- **తూటుకాడను వెంటనే తొలగించండి : ఎమ్మెల్యే కొండయ్య**

చీరాలటౌన్, సెప్టెంబరు 6 : పంట కాలువల్లో సక్రమంగా నీరు ముందుకు సాగేలా చూడాలని చీరాల శాసనసభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. అధికారులతో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం చీరాల మండల పరిధిలోని వాడరేవు - విజయలక్ష్మీపురం పంట కాలువ లాకులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాలువల్లో ఉన్న తూటుకాడను విధిగా తొలగించాలని సూచించారు. అవసరం మేరకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అన్నారు. అలాగే వంతెనకు సంబంధించి గండి పడిన ప్రదేశాన్ని గుర్తించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వెంట పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

విజయవాడ వరద బాధితులకు చీరాలకు చెందిన పులి వెంకటేశ్వర్లు రూ.లక్ష, కారుసాల శైలజ రూ.50 వేలను సీఎం సహాయనిధికి ప్రకటించారు. సంబంధిత చెక్కులను శుక్రవారం శాసనసభ్యులు ఎంఎం కొండయ్యకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి మానవత్వంతో సాయం అందించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటా

తీర ప్రాంతాల్లోని మత్స్యకారులకు పూర్తి అండగా ఉంటామని చీరాల శాసన సభ్యులు ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం వాడరేవు తీరంలో వర్షాలు కారణంగా దెబ్బతిన్న బోటులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఫిషర్‌మాన్ రక్షణార్థం ఏర్పాటు చేసిన భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భవనానికి మరమ్మతులు చేయాలని, మత్స్యకారులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, మత్స్యకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలి

అద్దంకి, సెప్టెంబరు6: ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి అభివృద్ధికి సహకరించాలని డీఎం రామ్మోహనరావు అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు వాలీబాల్, మొదటిర్యాంక్ సాధించేందుకు 100 సూత్రాలు పుస్తకాలను డీఎం రామ్మోహనరావు అందజేశారు. అద్దంకి మండలంలోని 10 హైస్కూళ్లలో వాలీబాళ్లు, పుస్తకాలను అందజేస్తామని డీఎం రామ్మోహనరావు తెలిపారు. అసిస్టెంట్ డీఎం మహబూబి, కొండలు తదితరులు పాల్గొన్నారు.

నామ్‌రోడ్డు పనులు పూర్తి ఎప్పటికో ?

దశాబ్ద కాలంగా అసంపూర్తిగా వదిలివేసిన వైనం

అద్దంకి, సెప్టెంబరు 6: రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే ప్రధాన రోడ్ల లో నార్కెట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల(నామ్) రోడ్డు కీలకమైనది. తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి తెలంగాణాతో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాలకు రవాణా సౌకర్యం కల్పించటంతో నామ్ రోడ్డు కీలకమైనది. అయితే దశాబ్ద కాలం క్రితం నామ్ రోడ్డులో అత్యధిక శాతం పనులు పూర్తి చేసి మూడు చోట్ల టోల్‌గేట్‌లు ఏర్పాటు చేసి టోల్ ఫీజు వసూలు చేస్తున్నారు. దశాబ్ద కాలం తరువాత నామ్ రోడ్డులో పెద్ద ఎత్తున మరమ్మతు పనులు చేస్తున్నారు. అయినప్పటికీ అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం చేయకుండా వదిలివేసిన ప్రాంతాలలో మాత్రం కనీసం మరమ్మతు పనులు కూడా చేయకుండా వదిలివేస్తుండటంతో వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లి నుంచి అప్పటి ప్రకాశం జిల్లా మేదరమెట్ల వరకు అటు విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి, ఇటు చెన్నై-కోలకత్తా జాతీయ రహదారులను కలుపుతూ 212.5 కి.మీ మేర నామ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రాష్ట్ర విభజన తరువాత 87.640 కి.మీ దూరం తెలంగాణా రాష్ట్ర పరిధిలో, 87.640 కి.మీ నుంచి 212.500 కి.మీ వరకు ఆంధ్రప్రదేశ్ లోకి చేరింది. రాష్ట్ర విభజనకు ముందు అత్యధిక శాతం సుమారు 190.38 కి.మీ మేర పనులు పూర్తి చేసి 2014 జనవరిలో మూడు చోట్ల మాడుగులపల్లి(నల్గొండ), తుమ్మలచెరువు(ఉమ్మడి గుంటూరు జిల్లా), ఏల్చూరు(ఉమ్మడి ప్రకాశం జిల్లా)ల వద్ద టోల్ గేట్ లు ఏర్పాటు చేసి టోల్ ఫీజు వసూలు ప్రారంభించారు. అనంతరం పలు దఫాలు గా పలు చోట్ల మిగిలి పోయిన పనులలో కొంత మేర పూర్తి చేశారు. అయితే ప్రస్తుత బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న అద్దంకి మండలం గోపాలపురం, సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద పనులు అసంపూర్తి గా నిలిచి పోయాయి. ఇక అద్దంకి పట్టణంలో రోడ్డు విస్తరించకుండా, అ లైన్‌మెంట్ మార్చకుండా ఉన్న రోడ్డునే అభివృద్ధి చేశారు. దీంతో అసంపూర్తిగా వదిలివేసిన పనులు దశాబ్ద కాలంగా పూర్తి చేయలేదు. గోపాలపురం, ఏల్చూరుల వద్ద అసంపూర్తిగా వదిలివేసిన రోడ్డు మరింత అధ్వానంగా మారింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఆయా ప్రాంతాలలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ పలువురు ప్రాణాలు కోల్పోతుండగా, మరి కొందరు క్షతగాత్రులు అవుతున్నారు.





నామ్ రోడ్డులో వదిలివేసిన నిర్మాణ పనులు (ఇన్‌సెట్లో) ఒకే వైపు ప్రయాణిస్తున్న వాహనాలు, మధ్య లో ఏర్పాటు చేసిన డివైడర్ దిమ్మెలు



పనులు అర్ధంతరంగా నిలిపివేయడంతో డంపింగ్ యార్డును తలపిస్తున్న నామ్ రోడ్డు

పరిహారం చెల్లింపులో జాప్యంతో నిలిచిన పనులు

గోపాలపురం, ఏల్చూరులలో భూసేకరణ చేసి రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉంది. మార్కెట్ ధరల ప్రకారం పరిహారం ఇవ్వాలని ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేయగా, అధికారులు మాత్రం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రికార్డుల ఆధారంగా చెల్లిస్తామని చెప్పటంతో చెల్లింపు నిలిచిపోయింది. అయితే అప్పటి నుంచి పరిహారం చెల్లింపు జరగకపోవటంతో రోడ్డు నిర్మాణ పనులు చేసేందుకు రైతులు, ఆయా గ్రామాల ప్రజలు అంగీకరించలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, అద్దంకి ఎమ్మెల్యేగా ఉన్న గొట్టిపాటి రవికుమార్‌కి మంత్రి మండలిలో స్థానం దక్కింది. ఈ నేపథ్యంలో రవికుమార్ అద్దంకి లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నామ్ రోడ్డులో అసంపూర్తి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, అదే సమయంలో రైతులకు చెల్లించాల్సిన పరిహారం కూడా వెంటనే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు మాత్రం ఇంతవరకు క్షేత్ర స్థాయిలో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేయకపోవటం చర్చనీయాంశంగా మారింది. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రైతులకు వెంటనే పరిహారం చెల్లించడంతో పాటు, అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేసే విధంగా చూడాలని గ్రామాల ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

వరద బాధితుల వెన్నంటే చంద్రబాబు

- **నాల్గోరోజు ఆయా ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే ఏలూరి**



వరద బాధితుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, సెప్టెంబరు 6: ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓవరమని, ప్రజల కష్టాలు తన కష్టంగా భావించి వెన్నంటే ఉంటాడని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం నాల్గవ రోజు సైతం విజయవాడలోని వరద పరిస్థితిని సమీక్షిస్తూ...ప్రజలకు ఆహారం మంచినీళ్లు అందిస్తూ వారి కష్టాలను అడిగి తెలుసుకుంటూ అండగా నిలుస్తున్నారు. వరద నీటిని బయటకు పంపేలా కాలువల్లో పూడికలు తీయిస్తూ అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈసందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతుగా విరాళాలను ఎమ్మెల్యే ఏలూరికి అందజేశారు.

దాతృత్వం చాటుకుంటున్న పర్చూరు నియోజకవర్గ వాసులు

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా పర్చూరు నియోజకవర్గ వాసులు కదలి వచ్చి తమ వంతు విరాళాలు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. యద్దనపూడి మండలం పూనూరు తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రూ.2,04,000, అనంతవరం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రూ.1,35,000 లక్షలు, ఇంకొల్లు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రూ.2,61,000 లక్షలు, అదేవిధంగా ఇంకొల్లు గ్రామానికి చెందిన బోడావుల మురళీకృష్ణ మరో రూ.50వేల విరాళాన్ని ఎమ్మెల్యే ఏలూరికి అందజేశారు.



విరాళాన్ని ఎమ్మెల్యే ఏలూరికి అందజేస్తున్న పూనూరు గ్రామ వాసులు

సీఎం సహాయనిధికి విరాళాలు

మార్టూరు, సెప్టెంబరు 6: విజయవాడలోని వరద బాధితులకు తమ వంతు సాయంగా ద్రోణాదుల జడ్పీ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం స్కూల్లో వసూలు చేసిన రూ.2,886 లను సీఎం సహాయనిధికి పంపించారు.

పంట నమోదు ఉంటేనే ప్రభుత్వ రాయితీలు

పంగులూరు, సెప్టెంబరు 6 :రైతులు ఖరీఫ్‌లో తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఆయా రైతు సేవా కేంద్రాల పరిధిలో నమోదు చేస్తున్నారని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని రామకూరు గ్రామంలో పంట పొలాలలో జరుగుతున్న నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రైతులు తాము పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలన్నా, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినపుడు ప్రభుత్వం అందించే నష్ట పరిహారం పొందాలన్నా, జీరో వడ్డీ సౌకర్యం పొందాలన్నా ఈ క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాలలో తాము సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు

డ్రోన్ టెక్నాలజీ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతుందని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో రైతు వినుకొండ శ్రీను సాగుచేస్తున్న మినుము పైరులో డ్రోన్‌తో క్రిమి సంహారక మందు పిచికారీ చేసిన విధానాన్ని వ్యవసాయ సిబ్బంది, రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కూలీల కొరత తీవ్రమవడం, పెరిగిన ఎరువులు, పురుగు మందుల ధరల వలన నష్టపోతున్న రైతులకు ఈ డ్రోన్‌లతో ఊరట లభిస్తుందన్నారు. ఐదుగురు కూలీలు చేసే పనిని ఒక్క డ్రోన్ చేస్తుందని, నీరు, మందు ఖర్చుతో పాటు సమయాన్ని తగ్గించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ దిల్షా, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



ముప్పవరం గ్రామంలో మినుము పైరుపై డ్రోన్‌తో క్రిమి సంహారక మందును పిచికారీ చేయడాన్ని పరిశీలిస్తున్న ఏవో

వినాయక మండపాల వద్ద పూర్తి నిఘా

బల్లికురవ. సెప్టెంబరు 6 : గ్రామాలలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న మండపాలపై గ్రామ స్థాయిలో ఉండే పోలీసు సిబ్బంది నిఘా పెట్టి, ఎలాంటి ఘర్షణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ జీవీ చౌదరి కోరారు. శుక్రవారం బల్లికురవ పోలీసు స్టేషన్‌లో మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న మహిళా పోలీసులతో ఎస్‌ఐ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీల వివరాలను సేకరించి దగ్గర ఉంచుకోవాలన్నారు. అందరు పర్మిషన్లు తీసుకోవాలని లేకుంటే వారి వివరాలను స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. రాజకీయ పార్టీల వారు ఒకే గ్రామంలో పోటా పోటీగా విగ్రహాలను ఏర్పాటు చేస్తే వారికి వేర్వేరు రోజుల్లో నిమజ్జన తేదీలను కేటాయిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలి

వేటపాలెం(చీరాలటౌన్), సెప్టెంబరు6 : వినాయక చవితి పర్వదినాన్ని ఆహ్లాకరమైన వాతవరణంలో జరుపుకోవాలని చీరాల డీఎస్పీ జగదీష్‌నాయక్ అన్నారు. శుక్రవారం వేటపాలెం మండలం దేశాయిపేటలోని చల్లా సుబ్బయ్య రామయ్య కల్యాణ మండపంలో గ్రామ ప్రజలు, భక్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండపాల సమీపంలో పోలీసు నియమాలు ఉండేలా చూసుకోవాలన్నారు. వర్గాలుగా మారి వివాదాలు పెంచుకునేలా ఉత్సవాలు నిర్వహించరాదని సూచించారు. ఎస్సై వెంకటేశ్వర్లు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నాగార్పమ్మకు పగడాల హారం బహూకరణ

వేటపాలెం(చీరాలటౌన్), సెప్టెంబరు 6 : వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ రావూరిపేటలోని కనక నాగార్పమ్మకు రూ.40 వేలు విలువగల బంగారు పగడాల హారాన్ని పాటిపండ్ల నరసింహారావు కుటుంబ సభ్యులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు అచ్చింశెట్టి భానుమూర్తి, బండ్లబాబులు దాతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో నాగార్పమ్మ అమ్మవారు

చీరాల అమరావారి వీధిలో...

చీరాల అమరావారి వీధిలోని అభయ గణపతి స్వామి వారికి 66వ వార్షికోత్సవ నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. దాతల సహకారంతో కిరీటాన్ని అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో చాంపియన్‌గా నోమేర్



చీరాలటౌన్, సెప్టెంబరు 6 : శ్రీకాకుళంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ జూనియర్ చాంపియన్ షిప్ సింగిల్స్‌లో చీరాలకు చెందిన షేక్ నోమేర్ ఉత్తమ ప్రదర్శన కనబరిచి చాంపియన్‌గా నిలిచాడు. అంతేకాకుండా ఈనెల 8 వ తేదీ నుంచి 11వ వరకు రాజమండ్రిలో జరిగే సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్రాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. అయితే ఈ క్రీడాకారుడిని ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. చిన్ననాటి నుంచి క్రీడల్లో తనదైన శైలిలో ఉత్తమంగా రాణిస్తున్న నోమేర్‌కు ఆర్థిక తోడ్పాటు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మార్టూరు, సెప్టెంబరు 6: జాతీయ రహదారిపై అంబేడ్కర్ నగర్ ఎదురుగా రోడ్డు దాటుతున్న కాలేషావలి (40) అనే వ్యక్తిని లారీ ఢీకొనడంతో మృతి చెందాడు.ఈ ఘటన గురువారం అర్థరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు కాలేషావలి గురువారం స్థానికంగా గొట్టిపాటి నగర్‌లో బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి రాత్రి ఇంటికి వెళ్లే సమయంలో రోడ్డు దాటుతుండగా ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళ్లే లారీ ఢీకొన్నది. దాంతో ఘటనా స్థలంలోనే కాలేషావలి మృతిచెందారు. మృతుడి తండ్రి షేక్ ఖాదర్‌వలి ఫిర్యాదు మేరకు శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్‌హౌస్ ఆఫీసర్ ఎం. శేషగిరిరావు తెలిపారు.

కారును ఢీ కొట్టిన లారీ

అద్దంకి, సెప్టెంబరు 6: నామ్ రోడ్డులో మేకల మంద అడ్డురావటంతో కారు డ్రైవర్ బ్రేక్ వేయటంతో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. వివరాలలోకి వెళితే నామ్ రోడ్డులో మేదరమెట్ల - అద్దంకి మధ్య ధేనువకొండ పునరావాసకాలనీ బలరామకృష్ణాపురం సమీపంలో శుక్రవారం మేదరమెట్ల వైపు నుంచి కారు వస్తుండగా మేకల మంద అడ్డు వచ్చింది. దీంతో కారు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో వెనుక నుంచి వస్తున్న లారీ కారును ఢీ కొట్టింది. దీంతో కారు రోడ్డు మార్జిన్ లోకి దూసుకు పోయింది. కారు వెనుక భాగం, లారీ ముందు భాగం దెబ్బతినింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవటంతో ఊపిరిపీల్చుకున్నారు.



లారీ ఢీ కొట్టడంతో రోడ్డుపక్కకి దూసుకుపోయిన కారు

సచివాలయ భవనంలోకి పంచాయతీ కార్యాలయం

ఇంకొల్లు, సెప్టెంబరు 6 : ఇంకొల్లు పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరి ప్రమాద భరితంగా మారింది. దీంతో కార్యాలయాన్ని నూతనంగా నిర్మించిన సచివాలయ భవనంలోకి మార్చినట్లు కార్యదర్శి కోటినాగయ్య తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

సమతుల ఎరువుల వాడకంతో రైతులకు ప్రయోజనం

గవినివారిపాలెం(చీరాలటౌన్), సెప్టెంబరు 6 : సమతుల ఎరువుల యాజమాన్యంతో రైతులకు తక్కువ ఖర్చుతో పాటు దిగుబడులు అధికంగా ఉంటాయని పలువురు జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొన్నారు. చీరాల మండలం గవినివారిపాలెంలో ప్రకృతి వ్యవసాయం, మట్టి నమూనా పరీక్షలకు సంబంధించిన ప్లకార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా హాజరయిన శాస్త్రవేత్తలు, అధికారులు మాట్లాడుతూ రైతులు విత్తన శుద్ధి తప్పని సరిగా పాటించాలన్నారు. అలాగే సాగు ఖర్చు తగ్గించుకునే అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం అధికారిణి విజయనిర్మల, ఏరువాక శాస్త్రవేత్త ఉషారాణి, ఏడీఏ రత్నకుమారి, మాస్టర్ ట్రైనర్ భారతి, వ్యవసాయ అధికారి సుమతి, వీఏఏలు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పది మంది జూదరుల అరెస్ట్

అద్దంకి, సెప్టెంబరు6: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని రూ. 2,71,590 లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం అద్దంకి పట్టణంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల వెనుక రేకులషెడ్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావటంతో దాడి చేశారు. 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పౌష్టికాహారంతో రోగ నిరోధక శక్తి పెరుగుదల

బల్లికురవ, సెప్టెంబరు 6 : రోజూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకునేవారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సీడీపీవో సుధ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వైదన గ్రామంలో పౌష్టికాహార వారోత్సవాల కార్యక్రమం అంగన్ వాడీ కేంద్రంలో జరిగింది. ఈసందర్భంగా తల్లులకు, గర్భిణులకు పౌష్టికాహారం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సలోమి, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మీ, పద్మ, పద్మావతి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన పెంచండి

పంగులూరు, సెప్టెంబరు 6 : ప్రజలకు వ్యాధులు దరి చేరకుండా ఉండేందుకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలలో అవగాహన పెంపొందించాలని పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ సంతానసేన్ సూచించారు. శుక్రవారం పంగులూరు - 2 విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సెంట్రల్ టీమ్ ప్రతినిధులు సందర్శించారు. క్లినిక్‌లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నేషనల్ మానిటర్ ఎడ్వినా పెరయిరా, జిల్లా క్వాలిటీ మేనేజర్ ధనరాజు, వైద్యాధికారులు డాక్టర్ శివచెన్నయ్య, డాక్టర్ బాలరాజేశ్వరి, సూపర్ వైజర్ హరిబాబు, ఏఎన్‌ఎం ఎస్తేరురాణి, సీహెచ్‌వో పావని, బిందు, స్వప్నలత, సుష్మిత, విష్ణువర్ధన్, శిల్ప, ఏసోబు, వాణి, అశ్మిత్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.1.20 లక్షల విలువైన వంట సరుకులు పంపిణీ


అద్దంకి నుంచి విజయవాడ వరద బాధితులకు తరలించిన వంట సరుకులు, దుప్పట్లు

అద్దంకి, సెప్టెంబరు 6: విజయవాడలో వరద బాధిత కుటుంబాలకు అద్దంకికి చెందిన పలువురు దాతలు సుమారు రూ. 1.20 లక్షల విలువైన వంట సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అద్దంకి పట్టణానికి చెందిన కల్యాణి క్యాటరింగ్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ అత్తులూరి రమేష్, చుండూరి మురళీసుధాకరరావు, చామర్తి మల్లికార్జునరావు, కురిచేటి శంకరరావు, వెంకటరమణ స్వీట్ షాపు యజమాని వెంకటరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి శుక్రవారం 1.20 లక్షల రూపాయల విలువైన వంట సరుకులు, దుప్పట్లు కొనుగోలు చేసి విజయవాడ తీసుకు వెళ్లి 100 కుటుంబాలకు పంపిణీ చేశారు.

పూడికతీత పనులు ప్రారంభం


అద్దంకిలోని సంజీవనగర్‌లో మేజర్ సైడ్ డ్రైన్‌లో పూడిక తీస్తున్న కూలీలు

అద్దంకి, సెప్టెంబరు6: అద్దంకి పట్టణంలోని పలు మేజర్ సైడ్ డ్రైన్ లలో పూడిక తీత పనులు చేపట్టారు. ఇటీవల అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంత్రి రవికుమార్ నిర్వహించిన సమీక్షలో అద్దంకి పట్టణంలో సైడ్ డ్రైన్‌ల పూడిక తీత పనులు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించటంతో మున్సిపల్ అధికారులు మేజర్ డ్రైన్‌లలో పూడిక తీత పనులు ప్రారంభించారు. నామ్‌రోడ్డులో ఎస్‌బీఐ(ఏడీబీ) వద్ద నుంచి ప్రారంభమై సంజీవనగర్, కొత్తపేట, ఇందిరానగర్, గుంజివారిపాలెం మీదుగా గుండ్లకమ్మ నదిలో కలిసే మేజర్ సైడ్ డ్రైన్‌లో పూడికతీత పనులు కూలీల చేత చేయిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

చినగంజాం, సెప్టెంబరు 6 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మల్లారెడ్డి అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలను ఆయన ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. మట్టి వినాయకులను పూజిద్దాం, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుడ ఎసిద్ధం నాగమల్లేశ్వరరావు తన సొంత నిధులతో మట్టి వినాయక ప్రతిమలను తయారుచేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.చంద్రశేఖర్, ఎస్.నాగమల్లేశ్వరరావు, సీఆర్పీ సీ.హెచ్ సురేంద్రకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవాడలో పారిశుధ్య పనులు ముమ్మరం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 6: విజయవాడలో పారిశుధ్య పనుల నిర్వహణలో జిల్లాకు చెందిన పంచాయతీ కార్మికులు భాగస్వామ్యులయ్యారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 50 మంది పారిశుధ్య కార్మికులు, 15 మంది పంచాయతీ కార్యదర్శులు విజయవాడకు తరలివెళ్లారు. విజయవాడ నగరంలోని పలు కాలనీల్లో పారిశుధ్య పనులతోపాటు బ్లీచింగ్ వంటి పనులు చేసేందుకు పంచాయతీ పారిశుధ్య కార్మికులను 15 బృందాలను ఏర్పాటు చేశారు.

ఒక్కొక్క బృందంలో ముగ్గురు పారిశుధ్య కార్మికులకు కలిపి పంచాయతీ కార్యదర్శిని నియమించారు. వారి ద్వారా ఆ కాలనీల్లో శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ వంటి పనులు చేపడుతున్నారు. విజయవాడలోని రామవరప్పాడు, ఎనికెపాడు, గొల్లపూడి ప్రాంతాలు, పెనుగంచిప్రోలు మండలంలోని గుమ్మడిదుర్రు, అనిగండ్లపాడు, ముచ్చింతల, శనగపాడు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇంకొకవైపు పంచాయతీలకు చెందిన ఎలక్ట్రిషియన్లు కూడా ఈ పనుల్లో పాల్గొన్నారు. జిల్లాకు చెందిన పారిశుధ్య కార్మికులు తమవంతు బాధ్యతగా అక్కడ విధులు నిర్వహిస్తున్నారు.

మైనర్ బాలికను వేధిస్తున్న ఆకతాయిపై కేసు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 6: మైనర్ బాలికను వేధిస్తున్న ఆకతాయిపై ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. రెండేళ్ల క్రితం బాలిక పదో తరగతి చదువుతున్న సమయంలో ఒంగోలు నగరం వడ్డివానికుంటకు చెందిన పెద్రా బాబు పరిచయమయ్యాడు. అతడిపై తాలుకా పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీటు ఉండటం, అతని ప్రవర్తనపై అనుమానింతో సదరు బాలిక మాట్లాడటం మానేసింది. అయితే అప్పటి నుంచి బాలిక వెంటపడుతున్న బాబు తనతో ఫోన్ మాట్లాడాలంటూ వత్తిడి తెస్తున్నాడు. లేకుంటే తనను, తల్లిదండ్రులను చంపుతానని బెదిరిస్తున్నాడు. అంతేగాకుండా ఇంటికి వచ్చి గొడవ చేస్తానని వేధిస్తున్నాడు. అయితే బాలిక కాలేజీలో చదువుతూ ఇతర ప్రాంతంలో ఉంటుంది.

గత నెలలో సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చింది. ఈనెల 4న బాలిక వెంటపడిన బాబు చంపేస్తానని బెదిరించాడు. ఈమేరకు బాలిక తల్లిదండ్రులు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండపాలకు తరలిన గణనాథులు

» పూజా సామగ్రి, పత్రి కొనుగోలుతో సందడి

అద్దంకి, సెప్టెంబరు6: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మండపాలలో కొలువుదీరేందుకు గణనాథులను శుక్రవారం సాయంత్రం భక్తులు తరలించారు. అద్దంకి లోని వినాయక విగ్రహాల అమ్మకాల కేంద్రాల నుంచి భక్తులు కొనుగోలు చేసి ఆయా గ్రామాలకు తీసుకువెళ్ళారు.ముందే సిద్ధం చేసిన మండపాలలో వినాయక విగ్రహాలను ఉంచారు. శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వినాయక పూజకు అవసరమైన పూజా సామగ్రి, పత్రిక కొనుగోలుతో అద్దంకి పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్ కిటకిటలాడింది.


అద్దంకిలోని పాతబస్టాండ్ సెంటర్‌లో కొనుగోలు చేస్తున్న పత్రి, పూజా సామగ్రి

వివాదాలు లేకుండా పండగను జరుపుకోవాలి


పర్చూరు పోలీసు స్టేషన్ వద్ద విగ్రహ కమిటీ ప్రతినిధులకు సూచనలు ఇస్తున్న సీఐ శ్రీనివాసరావు

పర్చూరు, సెప్టెంబరు 6: ఎలాంటి వివాదాలకు తావులేకుండా స్నేహ భావం, శాంతియుత వాతావరణంలో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని మార్టూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక పర్చూరు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వినాయక విగ్రహ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటుకు తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మండపాలు, పందిళ్ళ వద్ద గొడవలకు దిగితే కమిటీ ప్రతినిధులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మాల్యాద్రి, వినాయక విగ్రహ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

పర్చూరు, సెప్టెంబరు 6: వినాయక చవితి పర్వదినం సందర్భంగా పర్చూరులోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం 1500 వినాయక మట్టి ప్రతిమలను వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న, మాజీ ఎంపీపీ కోటా హరిప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టితో తయారు చేసిన విగ్రహాలను మాత్రమే వినియోగించాలని వైస్ ఎంపీపీ కోరారు. మాజీ ఎంపీపీ కోటా హరిప్రసాద్ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయటం అభినందనీయం అన్నారు. ఈకార్యక్రమంలో రావూవారి ప్రసాద్, అలయ అర్చకులు బృందావనం సత్యన్నారాయణ, రొటేరియన్ కోటా శ్రీనివాసరావు, క్రిష్ణంశెట్టి జగదీష్, ఒగ్గిశెట్టి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ


మట్టి వినాయక ప్రతిమను అందుకుంటున్న సీఐ శ్రీనివాసరావు

చీరాలటౌన్, సెప్టెంబరు 6 : మట్టి వినాయకులతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వన్‌టౌన్ సీఐ మారీడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని కొట్ల బజార్‌లో ఓగేటి శాస్త్రి సహకారంతో మట్టివినాయక ప్రతిమలు, గొడుగులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరయిన సీఐ భక్తులకు ప్రతిమలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని, నియమాలు కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మహాగణపతి యూత్ విశ్వనాథశాస్త్రి, సిద్ధునాథ శాస్త్రి, సాయి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్లపాడు సొసైటీలో భారీ అక్రమాలు

» లక్షలాది రూపాయలు దుర్వినియోగం
» రూ.1.60 కోట్ల రుణాల బాండ్లు మాయం
» 1,290 వాయిదా మీరిన బకాయిలు
» ఆడిట్‌లో వెల్లడైన అక్రమాలు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 6 : పీడీసీసీ బ్యాంకు కనిగిరి శాఖ పరిధిలోని హనుమంతునిపాడు మండలం ముప్పాళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఆడిట్‌లో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే రూ.1.20 కోట్ల నష్టాల్లో ఉన్న సొసైటీ తాజాగా వెలుగుచూసిన అక్రమాలతో మరింత ఇబ్బందుల్లోకి నెట్టబడింది. వివిధ రూపాల్లో సొసైటీ నిధులు స్వాహా చేశారు. 258 మంది రైతులకు ఇప్పించిన రుణాలు రూ.1.60 కోట్లకు సంబంధించిన బాండ్లు కనిగిరి బ్యాంకు శాఖలో గల్లంతయ్యాయి. ఈ మొత్తం వసూలు ప్రశ్నార్థకంగా మారింది.

1,290 మంది రైతుల రుణ బకాయిలు వాయిదా మీరిపోవడంతో వాటికి సంబంధించి సుమారు రూ.4కోట్లు సొసైటీ వదులుకోవాల్సి వస్తోంది. రుణాలకు సంబంధించి రైతులు చెల్లించాల్సిన వడ్డీ మొత్తాలను తక్కువగా వసూలు చేసినట్లు చూపించి మిగతా స్వాహా చేశారు. సొసైటీలో జరిగిన ఈ అక్రమాలపై ఆడిటర్ కె.వెంకటేశ్వర్లు ప్రత్యేక నివేదికను సమర్పించారు. ఈ మొత్తాలను పాలకవర్గం, సీఈఓ నుంచి 18శాతం వడ్డీతో వసూలు చేయమని, అక్రమాలను తేల్చేందుకు సమగ్ర విచారణ జరిపించాలని ఒంగోలు డివిజనల్ సహకారాధికారి పి.రాజశేఖర్ డీసీఓ బి.శ్రీనివాసరెడ్డిని కోరారు. తగు చర్యల కోసం ఈ ప్రత్యేక నివేదికను పీడీసీసీ బ్యాంకు సీఈవోకు పంపినట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా డీసీఏఓ చెప్పారు.

తనఖా బాండ్లు మాయం

సొసైటీ నుంచి పీడీసీసీ బ్యాంకు కనిగిరి శాఖ ద్వారా రూ.1.60 కోట్ల రుణాలు పొందిన 258 మంది రైతులకు సంబంధించిన తనఖా బాండ్లు కనిగిరి బ్యాంకులో గల్లంతయ్యాయి. రుణాలకు సంబంధించిన బకాయిలు వసూలయ్యేంత వరకు ఈ బాండ్లను బ్యాంకులో జాగ్రత్తగా భద్రపర్చాలి. అయితే బ్యాంకులో ఒకటి రెండు కాకుండా మొత్తం బాండ్లు గల్లంతు కావడం సంచలనంగా మారింది. రుణాలకు సంబంధించి తనఖా బాండ్లు మాయం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొసైటీ పాలకవర్గం అప్పటి బ్యాంకు అధికారులు కుమ్మక్కై బాండ్లను మాయం చేశారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అసలు బాండ్లు లేకుండానే రుణాలు పంపిణీ చేశారా? అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. బ్యాంకు, సహకారశాఖ అధికారుల నిర్లక్ష్యం సొసైటీని కోలుకోలేని దెబ్బతీసింది. అధికారుల వైఖరిని అక్రమార్కులు ఆసరా చేసుకొని సొసైటీని పీల్చిపిప్పి చేశారు.

అక్రమాలే ఇవే....

సొసైటీలో జరిగిన పలు అక్రమాలకు సొసైటీ పాలకవర్గం, సీఈఓలను బాధ్యులను చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా సొసైటీలో రోజువారి కూలీ కింద ఒకరిని నియమించి అతనికి రూ.36వేలు చెల్లించారు. ఈ మొత్తాన్ని పాలకవర్గం నుంచి వసూలు చేయాలని సిఫార్సు చేశారు.

స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు వసూలులో 14 మంది రైతుల నుంచి రూ.3,89,152 రావాల్సి ఉండగా రూ.1,59,087 మాత్రమే వసూలు చేసినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. మిగిలిన రూ.2,08,855 రైతుల నుంచి అసలు నిజంగా వసూలు చేయలేదా? లేక వసూలు చేసి దిగమింగారా అన్నది తేలాల్సి ఉంది.

ఇద్దరు రైతులకు సంబంధించి హెచ్‌ఎండీ డిపాజిట్లు లేనప్పటికి ఉన్నట్లుగా రికార్డుల్లో చూపించి ఆ మొత్తం లోనుకు జమ చేసినట్లు చూపించి స్వాహా చేశారు.

సొసైటీలో రెండు గదులు మరమ్మతుల కోసం రూ.1,83,620 వ్యయం చేసినట్లు చూపించారు. దీనికి సంబంధించిన అంచనాలు, ఎంబుక్ లేనందున ఆ మొత్తాన్ని పాలకవర్గం, సీఈఓ నుంచి వసూలు చేయమన్నారు.

51 మంది రైతులకు సంబంధించి సుమారు రూ.కోటికిపైగా వడ్డీ లేకుండా కేవలం అసలు మాత్రమే వసూలు చేసినట్లు నమోదు చేశారు. ఈ రుణాలకు సంబంధించి నిజంగా రైతుల నుంచి వడ్డీ వసూలు చేయలేదా లేక వసూలు చేసి స్వాహా చేశారా అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

బాధితులకు అండగా..

» కొనసాగుతున్న నిత్యావసరాలు, మంచినీరు తరలింపు
» తాజాగా కలెక్టర్ నేతృత్వంలో లక్ష పొట్లాల ఆహారం సరఫరా
» సహాయక కార్యక్రమాల పర్యవేక్షణలో మంత్రి డాక్టర్ స్వామి

వరద బారిన పడిన విజయవాడ ప్రజానీకానికి జిల్లావాసుల సహాయం కొనసాగుతోంది. ముంపు నుంచి అక్కడి ప్రజలు కొంతమేరకు తేరుకున్నప్పటికీ ఆహారం, తాగునీరు, ఇతర నిత్యావసరాల అవసరం అధికంగా ఉంది. దీంతో జిల్లాలోని వివిధ వర్గాల వారు శుక్రవారం కూడా భారీగా ఫుడ్ ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్లు, దుప్పట్లు ఇతరత్రా పలు రకాల సామగ్రి పంపించారు. అలాగే విభిన్న వర్గాల వారు పెద్ద ఎత్తున విరాళాలు కూడా అందజేస్తున్నారు.

ఒంగోలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లాలో పెద్ద ఎత్తున జనం ముందుకొస్తున్నారు. నాలుగు రోజులుగా లక్షలాది ఫుడ్ పార్శిళ్లు, తాగునీటి బాటిళ్లను కలెక్టర్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం పంపుతుండగా, వివిధ వర్గాల ప్రజలు సైతం స్పందించి సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. అదే స్ఫూర్తితో శుక్రవారం కూడా కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో లక్ష ఆహార పొట్లాలు, వేలాది పాల ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్లు, దుప్పట్లు, అగ్గిపెట్టెలు వంటి వాటిని పంపించారు. అలాగే సీఎం సహాయ నిధికి భారీగా విరాళాలు అందజేస్తున్నారు.

ఆహారం, సరుకులు, దుస్తులు కూడా

ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది సమకూర్చిన సాయాన్ని కలెక్టర్ సూచనలతో విడివిడిగా వాటిని లారీలు, ట్రాక్టర్లలో తీసుకెళ్లారు. ఐదారు రోజులుగా జిల్లా నుంచి వెళ్లి విజయవాడలో సహాయక కార్యక్రమాల్లో ఉన్న అధికారుల బృందం పర్యవేక్షణలో అక్కడి ప్రజలకు వాటిని అందజేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన విభిన్న వర్గాల వారు కూడా ఆహారం సరఫరా చేస్తున్నారు.

ఒంగోలు నగరానికి చెందిన శ్రీకృష్ణా ట్రావెల్స్ యజమాని చెన్నుపాటి వేణుగోపాల్, వారి సోదరుల నేతృత్వంలో ఆహారం, మంచినీటి బాటిళ్లు, దుస్తులు లారీలో పంపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జెండా ఊపి ఆ వాహనాన్ని పంపారు. ఎన్‌జీపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన రజక యువజన సంఘం ప్రతినిధులు రెండున్నర వేల పులిహోర పొట్లాలను, 1,200 మంచినీటి బాటిళ్లను పంపారు. మార్కాపురంలోని అల్ఫా గ్లోబల్ మినీ స్పేస్ వారు విజయవాడ కబేలా సెంటర్‌లోని 500 కుటుంబాలకు ఆహారం, మంచినీరు అందించారు.

భారీగా ఆర్థిక సాయం

మరోవైపు వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు జిల్లా నుంచి భారీగానే విరాళాలు అందజేస్తున్నారు. వివిధ వర్గాల వారు ఎవరికి వారు స్వయంగా పంపుతుండగా కొన్ని ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులు, ఇతర వర్గాల వారు, విద్యార్థులు విరాళాలు వసూలు చేస్తున్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ విజ్ఞప్తి మేరకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల టీడీపీ నాయకులు భారీగా సీఎం సహాయనిధికి విరాళాలు పంపిస్తున్నారు. ఇదిలా ఉండగా విజయవాడ నగరంలో సహాయక కార్యక్రమాల పర్యవేక్షణలో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి శుక్రవారం కూడా పాల్గొన్నారు. అక్కడి జక్కంపూడి కాలనీలో పర్యటించి వరద బాధితులకు ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపులను సందర్శించారు. ఆ సమయంలో ఫిట్స్ వచ్చి పడిపోయిన మహిళకు దగ్గర ఉండి వైద్యం చేయించారు. అలాగే పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో బాధితులకు అందించేందుకు ఉంచిన నిత్యావసర సరుకులను పరిశీలించారు. వినాయక చవితి పర్వదినం రోజున కూడా సహాయక కార్యక్రమాలు కొనసాగనున్నట్లు సమాచారం.


సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి స్వామి

10వేల ఆహార ప్యాకెట్లు

విజయవాడలో భారీ వరదలతో ప్రజానీకం తల్లడిల్లిపోతుండటంతో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ఒంగోలు నుంచి శుక్రవారం పదివేల పులిహార ప్యాకెట్లను ప్రత్యేక బస్సుల్లో తరలించారు. కలెక్టరేట్ ఎదుట జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి జెండా ఊపి ఆ బస్సులను ప్రారంభించారు. ఆ ఆహార ప్యాకెట్లను అక్కడి అధికారుల సూచనలకు అనుగుణంగా కాలనీల్లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో ఎన్.శివప్రసాద్, కార్యాలయ సిబ్బంది జి.రామకృష్ణ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు. వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ వడియ రాజుల సేవాసంఘం తరపున రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు విజయవాడకు మూడు వేల వాటర్ బాటిళ్లను ప్రత్యేక వాహనంలో పంపించారు.

రేషన్ బియ్యంపై నిరంతరం నిఘా

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 6 : జిల్లాలో రేషన్ బియ్యంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిరంతరం నిఘా ఉంచినట్లు డీఎస్‌వో ఉదయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. 'రెచ్చిపోతున్న రేషన్ మాఫియా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 31కి పైగా 6(ఏ) కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జిల్లావ్యాప్తంగా రేషన్ పంపిణీని పర్యవేక్షిస్తూ బియ్యం పక్కదారి పట్టకుండా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు

ఆలస్యంగా వచ్చిన ఎంఈవోలపై ఆగ్రహం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 6 : జిల్లా విద్యాశాఖ సమీక్షా సమావేశానికి ఆలస్యంగా వచ్చిన 28మంది మండల విద్యాధికారులపై సమగ్రశిక్ష ఏఎస్పీడీ, జిల్లా నోడల్ అధికారి కే శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.

మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభమైంది. ఐదు నిమిషాలు ఆలస్యంగా 28 మంది ఎంఈవోలు వచ్చారు. వారిని హాలులోకి అనుమతించకుండా వారిపై ఏఎస్పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటల తరబడి బయటే ఉంచారు. అనంతరం ఆయన ఎంఈవోలను ఉద్దేశించి మాట్లాడుతూ యూడైస్ పక్కాగా నిర్వహించాలన్నారు. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా సర్దుబాటు చేయాలని ఆదేశించారు. డీఈవో సుభద్ర, ఉపవిద్యాధికారులు సోమా సుబ్బారావు, చంద్రమౌళీశ్వరరావు, ఏసీ కే.శివకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం

తాళ్లూరు, సెప్టెంబరు 6: ప్రకృతి వ్యవసాయ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తూర్పుగంగవం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం సాగుచేసే రైతులకు ప్రోత్సాహక పరికరాలు అందజేశారు.

ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగుచేస్తున్న సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహించేందుకు వనరులను సమకూరుస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ రైతులు, మహిళా రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పట్టలను రాయితీపై అందజేస్తున్నట్లు చెప్పారు.నాగంబొట్లపాలెం యూనిట్ పరిధిలో 370 మంది రైతులు 425 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్నారని చెప్పారు. రైతులకు పట్టలు, డ్రమ్ములు పలురకాల పరికరాలు అందజేశారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్ యత్తపు కాశిరెడ్డి, టీడీపీ నాయకులు గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి(చందన), చాట్ల ఇమ్మానియేల్, వీఏఏ సుమ, ప్రకృతి సాగు ఇన్‌చార్జ్ పి.నరసింహులు, ఐసీఆర్‌పీలు మౌనిక, పల్లవి, కోట రత్తమ్మ, వాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
వినాయక చవితి శుభాకాంక్షలు
ANDHRAJYOTHY
శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 7 సెప్టెంబరు 2024

'సోమశిల'లో 42 టీఎంసీల నీటినిల్వ

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 13,053 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు డ్యాం అధికారులు తెలి పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 42.080 టీఎంసీలకు చేరుకొంది. దిగువ డెల్టాకు 1,050, కండలేరుకు 6,000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు నీటిని సరఫరా చేస్తున్నారు.

ఎంవీఐలకు పదోన్నతి

నెల్లూరు (క్రైం) : జిల్లా రవాణా శాఖలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లుగా (ఎంవీఐ) విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అధికారులకు ఆర్టీవోలుగా పదోన్నతి కల్పించి, బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు డీటీసీ కార్యాలయంలో ఎంవీఐ డీఎస్.కృష్ణకిశోర్ పదోన్నతి పొంది గూడూరు ఆర్టీవోగా, కే మురళీ మోహన్ పదోన్నతి పొంది, తిరుపతి ఆర్టీవోగా బదిలీ అయ్యారు. కందుకూరు ఆర్టీవోగా పీవీఎన్ లక్ష్మి పదోన్నతిపై రానున్నారు.




మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

మట్టి గణపతులకే జై

సీఎంఆర్ చంద్రన బ్రదర్స్, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో మట్టి ప్రతిమల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం) : పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులనే పూజిద్దామని ఎస్పీ కృష్ణకాంత్ జిల్లావాసులకు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి నగరంలోని సీఎంఆర్ చందన బ్రదర్స్, ఏబీఎన్ ఆంధ్ర జ్యోతి సంయుక్తంగా నిర్వహించిన మట్టి గణపతుల విగ్రహాల పంపిణీలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. సీఎంఆర్ చందనా బ్రదర్స్ అధినేత మావూరి శ్రీనివాసులు, రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య మాట్లాడుతూ ఆత్రేయపురం పూతరేకులతో 12 అడుగుల గణేష్ ప్రతిమను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజరు హరికృష్ణ, బూరో ఇన్‌చార్జి నాగరాజు, అడ్వర్టయిజ్‌మెంట్ ఇన్‌చార్జి అబ్దుల్ రహీం, ఏబీఎన్ బ్యూరో మహేష్, సీఎంఆర్ చందన బ్రదర్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గణపతిం భజే!

నేడు వినాయక చవితి

జిల్లాలో చవితి వేడుకలకు భారీ ఏర్పాట్లు


నెల్లూరు : ఎన్ని వినాయక ప్రతిమలో..

నెల్లూరు (సాంస్కృతికం) : సకల విఘ్నాలను తొలగించి, ప్రతి కార్యంలోనూ ప్రథమ పూజను అందుకునే మహాగణపతి ప్రకృతి దేవుడు. భాద్రపద శుద్ధ చవితి నాడు విఘ్నేశుడి జనన వేడుకలను వినాయక చవితిగా ఇంటింటా జరుపుకుంటారు. ఏకవింశతి (21 రకాల) పత్రాల సమ్మిళితమైన పత్రితో ఏకదంతుడిని ప్రత్యేకంగా అర్చిస్తారు. వినాయక చవితి పండుగ ఆధ్యాత్మికతతోపాటు ఐకమత్యాన్ని కూడా పెంపొందిస్తుంది. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో దేశ ప్రజలను సంఘటితం చేసి దేశభక్తిని రగిల్చేందుకు నాయకులు వినాయక చవితి పండుగను సాధనంగా ఉపయోగించారు. సామూహికంగా, బహిరంగంగా వినాయక చవితి పండుగను జరుపుకునే ఆనవాయితీని ప్రారంభించారు. నేటికీ అది కొనసాగుతోంది. అయితే ప్రకృతి హితంగా జరుపుకోవాల్సిన చవితి వేడుకలను ఆదునిక పోకడలు, ఆర్బాటాలతో ప్రకృతికి విఘాతం కలిగించే పండుగలా మార్చేశారు. మట్టి బొమ్మల స్థానంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వాటిని ఉపయోగించి నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమై ప్రాణాంతక వ్యాధులను వ్యాప్తి చేస్తున్నాయి. కాగా, చవితి వేడుకలకు జిల్లాలోని ఊరూవాడ ముస్తాబయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 6వేలకుపైగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క నెల్లూరులోనే దాదాపు వెయ్యి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. పలు కూడళ్లలో పందిళ్లు, భారీ సెట్టింగులతో పెద్ద ఎత్తున ఉత్సవాలకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఈ నెల 11వతేదీ వరకు నగరంలో గణేష్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. చవితి వేడుకల్లో భాగంగా గణపతి విగ్రహాల నిమజ్జనానికి నెల్లూరు చెరువులోని గణేష్ ఘాట్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్రేన్లు, విద్యుద్దీపాలంకరణ, సీసీ కెమెరాలు, ప్రసాదం కౌంటర్లు, పోలీసు బందోబస్తు, ఫ్లడ్‌లైట్ వెలుగుల్లో ఘాట్ ప్రాంతం కళకళలాడుతోంది. శనివారం ఈ ఘాట్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు భక్తులకు అంకితం చేస్తారు.

● బజార్లు కళకళ

నెల్లూరు నగరానికి చవితి కళ వచ్చేసింది. గణపతి పూజకు అవసరమైన సామగ్రితో దుకాణాలను అన్ని ప్రాంతాల్లో రోడ్ల పొడవునా ఏర్పాటు చేశారు. దీంతో కొనుగోలుదారులతో బజార్లు కళకళలాడుతున్నాయి. అయితే పూజా పత్రి, అరటి పిలకలు, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, చెరకుగడలు... ఇలా అన్నింటి ధరలు భగ్గుమంటున్నాయి. అయినా చవితిని ఘనంగా జరుపుకునేందుకు కొనుగోళ్లకు తరలివచ్చిన జనంతో వీధుల్లో రద్దీ నెలకొంది.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి : ఎస్పీ

నెల్లూరు (క్రైం) : ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో నిబంధనలకు లోబడి వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. గణేష్ ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చేపడుతున్న చర్యలు, పత్తా ఎస్టేట్ వద్ద ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లను పరిశీలించారు. అన్నీ శాఖలను సమన్వయం చేసుకుని అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పెన్నావారధి సమీపంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను కూడా శుక్రవారం రాత్రి ఎస్పీ పరిశీలించారు.





ఇండియన్ బ్యాంక్

ఇండియన్ బ్యాంక్ Indian Bank ALLAHABAD

నెల్లూరు శాఖ, గాంధీ విగ్రహం సమీపాన, సాయి విశ్వనాథ షాపింగ్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, ట్రంక్ రోడ్, నెల్లూరు-524001

అనుబంధం-IV-A (రూల్ 8(6) నిబంధన చూడగలరు)

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

ఇండియన్ బ్యాంక్ అధీకృత అధికారి, నెల్లూరు శాఖ, సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా నిర్మాణాత్మక (లాంఛనప్రాయ) స్వాధీనం చేసుకొనబడినట్టి, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/చార్జ్ చేయబడినట్టి దిగువ వివరించిన స్థిరాస్తి రుణగ్రహీతలు 1) మెసర్స్ జోషిక పీవీసీ పైప్స్ (రుణగ్రహీత) ప్రొప్రయిటర్ : శ్రీమతి మల్లి రజని, సర్వే నం. 206/3, పోతిరెడ్డిపాలెం (గ్రా), కోవూరు (మం)ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-524137, 2) శ్రీమతి మల్లి రజని (ప్రొప్రయిటర్) భర్త మల్లి ప్రసన్న కుమార్, డి.నం. 24-2-1846, 8వ స్ట్రీట్, రాంజీ నగర్, నెల్లూరు-524002, 1. శ్రీ మానస శానిటరీ సిమెంట్ పైప్స్ (రుణగ్రహీత) ప్రొప్రయిటర్ శ్రీమతి మల్లి రజని, సర్వే నం. 91/బి3, రీ సర్వే నం. 206/3, పోతిరెడ్డిపాలెం (గ్రామం), కోవూరు (మం), ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -524137. 2. శ్రీమతి మల్లి రజని (ప్రొప్రయిటర్) భర్త మల్లి ప్రసన్న కుమార్, డి.నం. 24-2-1846, 8వ స్ట్రీట్, రాంజీ నగర్, నెల్లూరు 524 002. 1. శ్రీ విష్ణు పివిసి పైప్స్ ఫ్యాక్టరీ (రుణగ్రహీత), ప్రొప్రయిటర్ : శ్రీ మల్లి ప్రసన్న కుమార్, సర్వే నం. 207, పోతిరెడ్డి పాలెం (గ్రామం), కోవూరు(మం), ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూర జిల్లా, ఆంధ్రప్రదేశ్524137. 2. శ్రీ మల్లి ప్రసన్న కుమార్ (ప్రొప్రయిటర్), తండ్రి శ్రీ మల్లి శంకర రావు, డి.నం. 24-2-1846, 8వ స్ట్రీట్, రాంజీ నగర్, నెల్లూరు -524 002. హామీదారులు: 1. శ్రీ మల్లి ప్రసన్న కుమార్ (హామీదారు) తండ్రి శ్రీ మల్లి శంకర రావు, డి.నం. 24-2-1846, 8వ స్ట్రీట్, రాంజీ నగర్, నెల్లూరు- 524002. 2. శ్రీ మల్లి శంకర రావు (హామీదారు) తండ్రి స్వర్గీయ శ్రీ దాసరయ్య, డి.నం. 24-2-1846, 8వ స్ట్రీట్, రాంజీ నగర్, నెల్లూరు- 524002. 3. శ్రీమతి మల్లి రజని (హామీదారు) భర్త మల్లి ప్రసన్న కుమార్, డి.నం. 24-2-1846, 8వ స్ట్రీట్, రాంజీ నగర్, నెల్లూరు-524002 వారి నుండి ఇండియన్ బ్యాంక్ నెల్లూరు శాఖ సెక్యూర్డ్ క్రెడిటార్‌కు రావలసిన బకాయి 29.08.2024 నాటికి **రూ.34,97,29,391/-** (రూపాయలు ముప్పై నాలుగు కోట్ల తొంభై ఏడు లక్షల ఇరవై తొమ్మిది వేల మూడు వందల తొంభై ఒకటి) రాబట్టుకొనుటకు 25.09.2024న ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా, ఏది ఎక్కడ ఉంటే అదే, అక్కడ ఏముంటే అదే ప్రాతిపదికన 25.09.2024న విక్రయించబడునని సాధారణ ప్రజలకు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

ఇ-వేలం విధానంలో అమ్మకానికి తీసుకురాబడినట్టి ఉద్దేశించబడిన ఆస్తి నిర్దిష్ట వివరాలు దిగువ తెలియజేయబడినవి.

ఆస్తి వివరణ ఆస్తి 1: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, పోతిరెడ్డి పాలెం గ్రామం మరియు పంచాయతీ, కోవూరు మండలం, సర్వే నం.207లోని, ఎ.3.00 సెంట్లు, అందులో ఎ.0.85 సెంట్లు, అందులో ఎ.0.42 1/2 సెంట్లు లేదా 257.12 అంకణాలు లేదా 2057 చ.గజాలు స్థలం మరియు విస్తీర్ణం 2009 చ.అడుగులు ఎసిసి రూఫ్ కట్టడం దానిలో, అసెస్‌మెంట్ నం. 593, శ్రీ మల్లి ప్రసన్న కుమార్ తండ్రి శ్రీ ఎం.శంకర్ రావుకు చెందిన ఆస్తి. సరిహద్దులు: తూర్పు: మల్లి బాల కృష్ణ స్థలం, దక్షిణం: కోవూరు షుగర్ ఫ్యాక్టరీ భూమి, పశ్చిమం: గొందుబోయిన నాగేశ్వర రావు మరియు కాలేషా భూమి, ఉత్తరం: రోడ్. అన్ని అనుభోగ హక్కులతో ఎసిసి రూఫ్ ఇల్లు 2009 చ.అ.లు విస్తీర్ణం మరియు 2057 చ.గజాలు లేదా 257.12 అంకణాలు లేదా ఎ.0.42 1/2 సెంట్ల విస్తీర్ణం పై సరిహద్దులతో కలిగిన ఆస్తి యావత్తు.

ఆస్తిపై ఏవేని తాకట్టు రుణభారాలు: లేదు

రిజర్వు ధర: రూ. **1,75,95,000/-** — బయానా : రూ. **17,59,500/-**

బిడ్‌పెరుగుదల మొత్తం రూ. **1,00,000/-** — ఆస్తి ఐడి నం. **IDIB263373277D**

ఇ-వేలం తేది మరియు సమయం:25.09.2024న ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. వరకు

ఆస్తి 2: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, పోతిరెడ్డి పాలెం గ్రామం మరియు పంచాయతీ, కోవూరు మండలం, సర్వే నం.207లోని దాని సబ్‌డివిజన్ 207/1, 5వ వార్డు బాంబే రోడ్డుకు పశ్చిమ భాగాన డోర్ నం.5-50, విస్తీర్ణం ఎ.0.42 1/2 సెంట్లు లేదా 257.12 అంకణాలు లేదా 2057 చ.గజాలు స్థలం మరియు కట్టడాలు దానిలో, అసెస్‌మెంట్ నం. 810, శ్రీ మల్లి రజని, భర్త ఎం.ప్రసన్న కుమార్‌కు చెందిన ఆస్తి. **సరిహద్దులు:** తూర్పు: షేక్ జలీషా స్థలం, దక్షిణం: కోవూరు షుగర్ ఫ్యాక్టరీ స్థలం, పశ్చిమం: మల్లి ప్రసన్నకుమార్ స్థలం, ఉత్తరం: రోడ్. అన్ని అనుభోగ హక్కులతో స్థలం యొక్క ఎ.0.42 1/2 సెంట్లు లేదా 257.12 అంకణాలు లేదా 2057 చ.గజాలు విస్తీర్ణం పై సరిహద్దులతో కలిగిన ఆస్తి యావత్తు.

ఆస్తిపై ఏవేని తాకట్టు రుణభారాలు: లేదు

రిజర్వు ధర: రూ. **1,61,41,000/-** — బయానా : రూ. **16,14,100/-**

బిడ్‌పెరుగుదల మొత్తం రూ. **1,00,000/-** — ఆస్తి ఐడి నం. **IDIB263373277E**

ఇ-వేలం తేది మరియు సమయం:25.09.2024న ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. వరకు

ఆస్తి 3,4&5 :4. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, పోతిరెడ్డి పాలెం గ్రామం మరియు పంచాయతీ, కోవూరు మండలం, పట్టా నం.78లో సర్వే నం.91-బి3 (పాత), రీ సర్వే నం.206/3 (కొత్త), ఇంటి స్థలం మొత్తం విస్తీర్ణం ఎ.0.50 సెంట్లు లేదా 302 1/2 అంకణాలు లేదా 2420 చ.గ.లో ఇంటి స్థలంలో విస్తీర్ణం 102.50 అంకణాలు లేదా 820 చ.గ. స్థలం శ్రీ మల్లి ప్రసన్న కుమార్, తండ్రి ఎం.శంకర్‌రావుకు చెందినది. **సరిహద్దులు:** తూర్పు: గుండెబోయిన నాగేశ్వరరావుకు చెందిన ఇంటి స్థలం, దక్షిణం: కన్నాము రాజుకు చెందిన ఇంటి స్థలం, పశ్చిమం: ఉమ్మడి దారి స్థలం వెడల్పు 25'-0", ఉత్తరం: మల్లి ప్రసన్నకుమార్ పేరున వట్టూరు వెంకటేశ్వర్లు 6 ఇతరుల ద్వారా వేరుచేయబడిన ఇంటి స్థలం యొక్క మధ్య భాగం. అన్ని అనుభోగ హక్కులతో దానిపై నిర్మించిన ఫ్యాక్టరీ షెడ్‌తో స్థలం యొక్క 102 .50 అంకణాలు లేదా 820 చ.గ విస్తీర్ణం పై సరిహద్దులతో కలిగిన ఆస్తి యావత్తు.

5. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, పోతిరెడ్డి పాలెం గ్రామం మరియు పంచాయతీ, కోవూరు మండలం, పట్టా నం.78లో సర్వే నం.91-బి3 (పాత), రీ సర్వే నం.206/3 (కొత్త), ఇంటి స్థలం మొత్తం విస్తీర్ణం ఎ.0.50 సెంట్లు లేదా 302 1/2 అంకణాలు లేదా 2420 చ.గ.లో ఇంటి స్థలంలో విస్తీర్ణం 100 అంకణాలు లేదా 800 చ.గ లేదా 669 చ.మీ స్థలం శ్రీమతి మల్లి రజని, భర్త శ్రీ ప్రసన్న కుమార్‌కు చెందినది. **సరిహద్దులు:** తూర్పు: గుండెబోయిన నాగేశ్వరరావుకు చెందిన ఇంటి స్థలం, దక్షిణం: మల్లి ప్రసన్నకుమార్ పేరున వట్టూరు వెంకటేశ్వర్లు మరియు 6 ఇతరుల ద్వారా వేరుచేయబడిన ఇంటి స్థలం యొక్క మధ్య భాగం, పశ్చిమం: ఉమ్మడి దారి స్థలం వెడల్పు 25'-0", ఉత్తరం: రోడ్డు, అన్ని అనుభోగ హక్కులతో దానిపై నిర్మించిన ఫ్యాక్టరీ షెడ్‌తో స్థలం యొక్క 100 అంకణాలు లేదా 800 చ.గ లేదా 669 చ.మీ విస్తీర్ణం పై సరిహద్దులతో కలిగిన ఆస్తి యావత్తు.

6. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, పోతిరెడ్డి పాలెం గ్రామం మరియు పంచాయతీ, కోవూరు మండలం, పట్టా నం.78లో సర్వే నం.91-బి3 (పాత), రీ సర్వే నం.206/3 (కొత్త), ఇంటి స్థలం మొత్తం విస్తీర్ణం ఎ.0.50 సెంట్లు లేదా 302 1/2 అంకణాలు లేదా 2420 చ.గ.లో ఇంటి స్థలంలో విస్తీర్ణం 100 అంకణాలు లేదా 800 చ.గ స్థలం శ్రీ మల్లి ప్రసన్న కుమార్, తండ్రి శ్రీ ఎం.శంకర్ రావుకు చెందినది. **సరిహద్దులు:** తూర్పు: గుండెబోయిన నాగేశ్వరరావుకు చెందిన ఇంటి స్థలం, దక్షిణం: మల్లి ప్రసన్నకుమార్ పేరున వట్టూరు వెంకటేశ్వర్లు మరియు 6 ఇతరుల ద్వారా వేరుచేయబడిన ఇంటి స్థలం యొక్క దక్షిణ భాగం, పశ్చిమం: ఉమ్మడి దారి స్థలం వెడల్పు 25'-0", ఉత్తరం: మల్లి రజని వదిలివేబడిన ఇంటి స్థలం యొక్క ఉత్తర భాగం, అన్ని అనుభోగ హక్కులతో దానిపై నిర్మించిన ఫ్యాక్టరీ షెడ్‌తో స్థలం యొక్క 100 అంకణాలు లేదా 800 చ.గ విస్తీర్ణం పై సరిహద్దులతో కలిగిన ఆస్తి యావత్తు.

ఆస్తిపై ఏవేని తాకట్టు రుణభారాలు: లేదు

రిజర్వు ధర: రూ. **2,31,10,000/-** — బయానా : రూ. **23,11,000/-**

బిడ్‌పెరుగుదల మొత్తం రూ. **1,00,000/-** — ఆస్తి ఐడి నం. **IDIB263373277ABC**

ఇ-వేలం తేది మరియు సమయం:25.09.2024న ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. వరకు

ఆస్తి 6: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రిజిస్ట్రేషన్ - బుచ్చిరెడ్డిపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, బుచ్చిరెడ్డిపాలెం రెవెన్యూ మండలం, బుచ్చిరెడ్డి పాలెం గ్రామపంచాయతీ ప్రాంతం, వవ్వేరు గ్రామ హెమ్లెట్, బుచ్చిరెడ్డిపాలెం-సర్వే నం.60/3లో భూమి, 6వ వార్డు, 13వ బ్లాక్ కొత్త కాసిపాలెం ఏరియా, డి.నం.బి13-24/6,7 విస్తీర్ణం 23 అంకణాలు లేదా 184 చ.గ. లేదా 153.87 చ.మీ.ల స్థలం మరియు కట్టడాలపై అసెస్‌మెంట్ నం.2565తో శ్రీ మల్లి ప్రసన్నకుమార్, తండ్రి శ్రీ మల్లి శంకర్‌రావుకు చెందినది **సరిహద్దులు:** తూర్పు: ఉమ్మడి మార్గం యొక్క వెడల్పు 9 అడుగులు, దక్షిణం: ఈ ఇంటి మధ్యన ఉమ్మడి గోడ మరియు మల్లి బుజ్జమ్మ ఇల్లు, పశ్చిమం: మల్లి రామాక్షమ్మ స్థలం,ఉత్తరం: ఈ ఇంటి మధ్యన ఉమ్మడి గోడ మరియు మల్లి బాలకృష్ణ ఇల్లు.అన్ని అనుభోగ హక్కులతో దానిపై నిర్మించిన ఫ్యాక్టరీ షెడ్‌తో స్థలం మరియు కట్టడాలు యొక్క 23 అంకణాలు లేదా 184 చ.గ లేదా 153.87 చ.మీ. విస్తీర్ణం పై సరిహద్దులతో కలిగిన ఆస్తి యావత్తు.

ఆస్తిపై ఏవేని తాకట్టు రుణభారాలు: లేదు

రిజర్వు ధర: రూ. **20,70,000/-** — బయానా : రూ. **2,07,000/-**

బిడ్‌పెరుగుదల మొత్తం రూ. **Rs.20,000/-** — ఆస్తి ఐడి నం. **IDIB263373277I**

ఇ-వేలం తేది మరియు సమయం:25.09.2024న ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. వరకు

బిడ్డర్లు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనడానికి మా ఇ-ఆక్షన్ సర్వీస్ ప్రొవైడర్ పి.ఎస్.బి. అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ (https://www.ebkray.in) దర్శించవలసిందిగా సూచించడమైనది. సాంకేతిక సహాయం కోసం సంప్రదించండి: 8291220220. రిజిస్ట్రేషన్ స్టేటస్ కోసం మరియు బయానా స్టేటస్ కోసం support.ebkray@psballiance.com కు ఇమెయిల్ చేయండి.

ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఫొటోగ్రాఫ్ మరియు వేలం నియమ నిబంధనల కొరకు దర్శించండి: https://www.ebkray.in మరియు ఈ పోర్టల్‌కు సంబంధించి ఏవేని స్పష్టీకరణల కోసం సంప్రదించండి: పి.ఎస్.బి. అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్, సంప్రదించు నం: **8291220220** గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం సమక్షంలో అపరిష్కృతంగా ఉన్న రిట్ పిటిషన్ నం. 16758 ఆఫ్ 2024 తీర్పుకు లోబడి అమ్మకం ఉంటుంది.

https://www.ebkray.in వెబ్‌సైట్‌లో ఆస్తి కోసం వెతికే సమయంలో పైన తెలిపిన ఆస్తి ఐడి నంబరును ఉపయోగించాలని బిడ్డర్లకు సూచించడమైనది.

తేది: 05.09.2024, ప్రదేశం: నెల్లూరు — సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

గణేశ్ ఉత్సవాలకు సర్వం సిద్ధం



కందుకూరు : తరలిస్తున్న గణనాథుడి విగ్రహం



కావలి : ట్రంకురోడ్డులో వినాయక ప్రతిమలు



ఉదయగిరి రూరల్: పూజ సామగ్రిని కొనుగోలు



సంగం: వేడుకలకు టెంట్ ఏర్పాటు



కావలిటౌన్ : కోలాహలంగా విగ్రహాల కొనుగోలు

కందుకూరు, సెప్టెంబరు 6: గణనాథుని నవరాత్రి ఉత్సవాలకు వాడవాడలా ఏర్పాట్లు చేశారు. కందుకూరు పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు శుక్రవారం సాయంత్రం కందుకూరు నుంచి వందలాది విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో తరలించారు. కందుకూరు పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే వాసవీ కల్యాణ మండపంతో పాటు పట్టణంలోని 25 ప్రాంతాల్లో, నియోజకవర్గంలోని దాదాపు ప్రతి గ్రామంలోనూ విగ్రహాలు కొలువుదీరుతున్నాయి. కొన్ని గ్రామాల్లో పార్టీల వారీగా నిర్వహించేందుకు యువకులు ఏర్పాట్లు చేసి పార్టీ జెండాలతో అలంకరించిన వాహనాల్లోనే గణనాథుని ప్రతిమలను తీసుకుని వెళ్లడం విశేషం. కాగా పట్టణంలోని పెద్దబజారులో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద బోణాల చక్రవర్తి ఆధ్వర్యంలో సీఐ కె.వెంకటేశ్వరరావు పాల్గొని ఉచిత మట్టి వినాయకుని ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రతినిధులు డాక్టరు తన్నీరు మల్లికార్జునరావు, ఇస్కాల సురేంద్ర, మురారిశెట్టి సుధీర్, కొత్తూరి సుధాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

కావలి : వినాయక ప్రతిమలు, పూజాసామగ్రి దుకాణాలతో కావలి ట్రంకురోడ్డు కిటకిటలాడుతోంది. స్థానిక బ్రిడ్జి సెంటర్ నుంచి ఒంగోలు బస్టాండ్ వరకు ట్రంకురోడ్డుకు ఇరువైపులా పూజా సామగ్రి దుకాణాలు వెలశాయి. దీంతో వినాయకచవితి శోభ సంతరించుకుంది. ఉదయం జనసేన పార్టీ ఇన్‌చార్జి అళహరి సుధాకర్, జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్యలు రెండు వర్గాలుగా మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.

కావలిటౌన్ : ముసునూరులోని దాదాపు 20 విగ్రహాల తయారీ, విక్రయాల కేంద్రాల వద్ద పట్టణ, గ్రామీణ ప్రాంతీయులు వినాయక విగ్రహాల కొనుగోలు, తరలింపుతో కోలాహలం నెలకొంది. నిర్వాహకులు ట్రాక్టర్లు, లారీలలో విగ్రహాలు తరలించారు.

అల్లూరు : వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లు ఘనంగా చేపడుతున్నారు. ఇప్పటికే వీధి వీధికి వేదికలను ఏర్పాటు చేసి విగ్రహాలను తరలిస్తున్నారు. అల్లూరు బజా రు, పాతబస్టాండు సెంటరుల్లో గణపతి బొమ్మలు, పత్రులు విక్రయిస్తుండగా కొనుగోలు కొనుగోలు చేస్తున్నారు. మండ లంలోని నార్తుమోపూరులో ఉన్న శ్రీచైతన్య విద్యాసంస్థలో విద్యార్థులు వినాయకుడి వేషధారణలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్, డైరెక్టర్ ఖాజారహంతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.



అల్లూరు : వినాయకుడి వేషధారణలతో విద్యార్థులు

లింగసముద్రం : గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు కొనుగోలు దారులతో సందడి నెకొంది. స్థానికంగా తయారు చేసిన విగ్రహాలనే కాకుండా కొన్ని గ్రామాల వారు కావలి, కందుకూరు పట్టణాల నుంచి కూడా విగ్రహాలు కొనుగోలు చేసి తరలించారు. మండలంలో ఏర్పాటు చేసే విగ్రహాలను రాళ్లపాడు ప్రాజెక్టు, ఉప్పుటేరు వద్ద నిమజ్జనం చేస్తారు.

కలిగిరి : మండలంలోని అన్ని గ్రామాల్లో విఘ్నేశ్వరుడు కొలువుదీరడానికి మండపాలు కొలువుదీరాయి. సమీప గ్రామాల నుంచి యువత ట్రాక్టర్లు, ఆటోలలో వచ్చి తాము కొనుగోల ుచేసిన గణనాథుని విగ్రహాలను తీసుకెళ్లారు. వినాయచవితి పూజా సామగ్రి, పత్రిని పట్టణంలోని పలు ప్రాంతాలలో అమ్మకాలకు సిద్ధంగా ఉంచడంతో సందడి వాతావరణం నెలకొంది.

బిట్రగుంట : బోగోలు మండలంలో వినాయక చవితి ఏర్పాట్లు జరిగాయి. గణపతి ప్రతిమలు, మట్టిబొమ్మలు, పూజా సామగ్రి దుకాణాలు వెలశాయి. విద్యుత్ దీప అలంకరణలతో వినాయక ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రతి గ్రామంలో వినాయక విగ్రహాలు ఏర్పాటుకు పందిళ్లు వేశారు.

ఆత్మకూరు/సంగం/ఉదయగిరి రూరల్ : ఆత్మకూరు, సంగం, ఉదయగిరి మండలాల్లో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువత సన్నద్ధం అవుతున్నారు. చిన్నా, పెద్దా అనే బేధం లేకుండా.. పట్టణం, గ్రామం అనే తేడా తెలియకుండా చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు వారి స్థాయిని బట్టి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే మహిళలు కూడా ప్రతి ఇంటి వద్ద ప్రతిష్ఠించేందుకు మట్టి వినాయక విగ్రహాలను కొనుగోలు చేశారు. శుక్రవారం పట్టణంలో కొనుగోలుకు ఉంచిన విగ్రహాలను వాహనాల్లో వారి గ్రామాల్లోని మండపాలకు తరలించారు. ఈ పూజ సామగ్రి, ఇతర పూజ వస్తువులు అమ్మకానికి ప్రధాన సెంటర్లలో ఏర్పాటు చేయడంతో వాటిని తీసుకునేందుకు జనాలు తరలిరావడంతో పండుగ వాతావరణం మొద లైంది.

గణపతి నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు



అలగాయపాలెం బీచ్‌లో పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

ఉలవపాడు : వినాయక చవితి పండుగ సందర్భంగా సముద్ర తీర ప్రాంతంలో గణపతి విగ్రహాల నిమజ్జనానికి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు కందుకూరు డీఎస్పీ ఏ శ్రీనివాస్ చెప్పారు. కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు, గుడ్లూరు సీఐ మంగారావు, స్థానిక ఎస్సై అంకమ్మతో కలిసి శుక్రవారం మండలంలోని అలగాయపాలెం, రామాయపట్నం బీచ్‌లను ఆయన పరిశీలించారు. ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలు నిమజ్జనం కోసం అలగాయపాలెం, రామాయపట్నం బీచ్‌లకు తరలిస్తారని చెప్పారు. మద్యం మత్తులో వినాయక నిమజ్జనం చేసేందుకు ప్రయత్నించి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని నిర్వాహకులకు సూచించారు.

చెరువులకు 'సోమశిల' జలాలు



కొత్తూరు వాగులో పారుతున్న సోమశిల జలాలు

బిట్రగుంట, సెప్టెంబరు 6: బోగోలు మండలంలోని కడనూతల, కోవూరుపల్లి చెరువులు పూర్తిగా ఎండిపోయి మూగజీవులు తాగేందుకు నీరు లేక అవస్థలు పడుతుండటంతో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కృషితో శుక్రవారం చెరువులకు సోమశిల నీరు చేరింది. దీంతో ఆయా గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విగ్రహాల ఏర్పాటుకు రూ.5 లక్షల విరాళం

వరికుంటపాడు, సెప్టెంబరు 6: వినాయకచవితిని పురస్కరించుకొని శుక్రవారం నారసింహాపురం టీడీపీ మాజీ మండల కన్వీనర్ యర్రా చినబ్రహ్మయ్య తనవంతు దాతృత్వం ప్రకటించాడు. 24పంచాయతీల పరిధిలో విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు ఒక్కొక్కరికి రూ.5వేలు, రెండు కిలోల లడ్డూలను చొప్పున రూ.5లక్షలు అందజేసినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, నియోజవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విజయం సాధిస్తే ఈ మొక్కు తీరుస్తానని అనుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో నాయకులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, శ్రీకాంత్‌యాదవ్, ముజ్జె లక్ష్మీనారాయణ, నాదిండ్ల రాజేంద్ర, పోకా మహేష్, నూనె ప్రసాద్ పాల్గొన్నారు.



నగదు, లడ్డూను అందజేస్తున్న యర్రా చిన్నబ్రహ్మయ్య

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

దగదర్తి (బిట్రగుంట): దామవరంలోని బీఎంఆర్ ట్రస్ట్ డైరెక్టర్ దొడ్ల వేణుగోపాల్‌రెడ్డి, బీఎంఆర్ ఫీడ్, ప్రాసెస్ ప్లాంట్ సభ్యులు కలసి నిత్యావసర వస్తువులను ప్రత్యేక వాహనంలో విజయవాడకు తరలించారు. కార్యక్రమంలో బీఎంఆర్ గ్రూప్ ఏజీఎం వీరాస్వామి, డీజీఎం శంకర్‌నారాయణరావు, బ్రహ్మానందరెడ్డి, కిశోర్, మొహిద్దీన్, వినోద్, శేషాద్రియాదవ్ పాల్గొన్నారు.

కొండాపురం: సాయిపేటలో సామాజిక కార్యకర్త భీమిరెడ్డి అరుణ, గంటా శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాల సేకరించారు. మూడురోజులు అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి వస్తు, నగదు రూపంలో విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తాటికొండ నవీన్, షేక్ మాబాషా, బాసం మాధవ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

సంగం, సెప్టెంబరు 6: స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు సీహెచ్ వెంకటేశ్వర్లు, వెంకట రెడ్డి, మండలస్థాయి ఉత్తమ అవార్డు గ్రహీతలు మోహన్‌రావు, కొండారెడ్డి, పద్మావతి, ప్రభాకర్‌శర్మ, మేరీమంజులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జానికీరాం, మల్లయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేయాలి

ఆత్మకూరు : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందజేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలోని వందూరుగుంట-2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాల సదస్సులో ఆమె పాల్గొన్నారు. సిబ్బంది విధులపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎండీ గుల్జార్‌బేగం, ఆశావర్కరు సుజాత ఉన్నారు.

పేట దర్గాలో కలెక్టర్ ప్రత్యేక ప్రార్థనలు

ఏఎస్ పేట, సెప్టెంబరు 6: హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గాలో శుక్రవారం కలెక్టర్ ఆనంద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల సమాధులపై పూలు, గలేఫాలు ఏర్పాటు చేశారు. దర్గా పరిసరాలను పరిశీలించి భక్తుల సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ ఉన్నారు. ఈ సందర్భంగా మండల సచివాలయ సిబ్బంది వరద బాధితులకు సహాయార్థం రూ.10వేల చెక్కును కలెక్టర్‌కు అందజేశారు.

14న మెగా లోక్‌అదాలత్

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 6: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 14న నిర్వహించే మెగా లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఉదయగిరి సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్‌ఐ కె.ఇంద్రసేనారెడ్డిలు తెలిపారు. సర్కిల్ పరిధిలోని మండలాల్లో 500 కేసుల్లో.. రాజీఅయ్యే కేసులను 200లను గుర్తించామన్నారు. ఇరువురి అంగీకారంతో వారు ఆయా పోలీస్‌స్టేషన్లను సంప్రదించాలన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన : కందుకూరి

కావలిటౌన్, సెప్టెంబరు 6: బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని పార్టీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన విలేకర్ల సమాశంలో మాట్లాడుతూ ఆరేళ్లకోసారి జరిగే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సీవీసీ సత్యం, బ్రహ్మనందం, మురళి పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీలదే.. మండపాల నిర్వహణ

చేజర్ల, సెప్టెంబరు 6: వినాయక చవితి మండపాల నిర్వహణ బాధ్యత ఉత్సవ కమిటీ సభ్యులదే అని అక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పోలీసులకు సహకరించాలని సీఐ వేమారెడ్డి తెలిపారు. పండుగ పూర్తి అయ్యేవరకు ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎక్కడైనా చిన్న సమస్య చోటు చేసుకున్నా ఆ కమిటీలదే నైతిక బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. గణనాధుడి దర్శనార్థం వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. శబ్ధ కాలుష్యం లేకుండా చూసుకోవాలన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల పరిశీలన

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : దుత్తలూరు సెంటర్‌లో వెళ్లిన 167-బీజీ జాతీయ రహదారి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు శుక్రవారం హైవే, రెవెన్యూ అధికారులతో కలిసి తహసీల్దారు నాగరాజు పరిశీలిం చారు. రోడ్డు విస్తరణలో భవనాలు, స్థలాలు కోల్పోయిన వారు అభ్యంతరా లుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

కోదండరాముడికి ప్రత్యేక పూజలు

కలిగిరి, సెప్టెంబరు 6: చంద్రారెడ్డిపాలెంలో నూతనంగా నిర్మించిన హనుమత్ లక్ష్మణ సీతా సమేత కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం 16 రోజుల పండుగ నిర్వహించారు. వేదపండితులు నారాయణం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహిం చా రు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

పశువైద్యాధికారి బాధ్యతల స్వీకరణ

కలిగిరి, సెప్టెంబరు 6: ఏడాది కాలంగా పెదకొండూరు పశువైద్యశాలలో ఖాళీగా ఉన్న వైద్యాధికారి పోస్టును ఎట్టకేలకు భర్తీ చేశారు. వెంకటగిరి నియోజకవర్గం లింగసముద్రం పశువైద్యశాల వైద్యాధికారి లక్ష్మీప్రసాద్ బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

కొండాపురం, సెప్టెంబరు 6: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై ఈ నెల 1వ తేదీ నుంచి సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం కొమ్మి, ఇస్కదామెర్ల, భీమవరప్పాడులో గ్రామసభలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో పనిచేయనివారికి కూలి చెల్లించడం, కొలతల్లో వ్యత్యాసాలు గుర్తించామని ఎస్‌ఆర్‌పీ నీలకంఠం తెలిపారు. అన్ని వివరాలు నమోదుచేసి ఈ నెల 12న మండలకేంద్రంలో జరగనున్న బహిరంగ విచారణలో ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. షెడ్యూల్ ప్రకారం చింతలదీవిలో గ్రామసభ జరగాల్సి ఉండగా పనుల్లో జరిగిన అవకతవకలు జరిగాయని ఆధారాలు అందచేస్తామని సర్పంచు గ్రామసభను వాయిదావేసి మళ్లీ జరిపించాలని కోరడంతో వాయిదాపడింది. కార్యక్రమంలో సర్పంచు వీ.ఈశ్వరమ్మ, ఏపీవో చెంచ య్య, కార్యదర్శి ప్రదీప్, ఉపసర్పంచు మాల్యాద్రినాయుడు పాల్గొన్నారు.



కూలీలను విచారిస్తున్న అధికారులు

పోషక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కావలి టౌన్, సెప్టెంబరు 6: పోషక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అడవిరాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక ఆహార వారోత్సవాలు నిర్వహించారు. డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి టానిక్‌లు అందజేశారు. గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుహాసినీ, మహిళా పోలీస్ సుప్రియ, ఏఎన్‌ఎం పద్మజ పాల్గొన్నారు.

అల్లూరు: పురిణి దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కావలి సీడీపీవో కె.సౌజన్య, సూపర్‌వైజర్ రాజేశ్వరి, టీడీపీ నేత సురేంద్ర, అంగన్‌వాడీలు త్రివేణి, రజిని పాల్గొన్నారు.

సాగరం మాజీ ఎంపీపీ మృతి

అనంతసాగరం, సెప్టెంబరు 6: టీడీపీ మండల సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ మునగపాటి సుబ్బరాజు (50) శుక్రవారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక పోయారు. ఆ యన సతీమణి మునపాటి సునీత టీడీపీ మండల అధ్యక్షురాలుగా పనిచేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మిలక్ష్మయ్యనాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి అంజనేయరెడ్డి, గిరినాయుడు, ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, మెట్టుకూరు కృష్ణారెడ్డి, సద్దా రవీంద్రారెడ్డిలు కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలి

ఏఎస్ పేట, సెప్టెంబరు 6: చెత్త సంపద కేంద్రాలను అక్టోబరు 2వ తేదీ నాటికి అభివృద్ధి చేయాలని ఎంపీపీ పద్మజారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరామ కృష్ణ, పీఆర్ ఏఈ ఖాదర్ బాషా, ఇరిగేషన్ అధికారులు మంజుల, నాగ, వినుత పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 6: మండల ఎస్‌ఐ ఆదిలక్ష్మిని శుక్రవారం టీడీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు మర్యాద పూర్వకంగా కలిసి సన్మా నించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తులసీరాం పాల్గొన్నారు.

బీరువా బహూకరణ

వింజమూరు: మండల ఎంఆర్సీకి విశ్రాంత ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బాలచెన్నయ్య, ఎంఆర్సీకి బీరువాను బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈవో మధుసూదనరెడ్డి, చెంచలబాబు, డీపీ నర్సింహులు ఉన్నారు.